
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ యాదవ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 300 | ది. 10-2-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 300 | Date : 10-2-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి

- కాలం చెల్లిన చట్టాలను మార్చుకుందాం
- సంక్షేమంతోనే అసమానతలు తగ్గుతాయి
- గత ప్రభుత్వంలో హెలీప్యాడ్ కోసం భూమి ఇవ్వలేదని 22ఏలో పెట్టేశారు
- ప్రపంచంతో పోటీ పడాలంటే... ప్రపంచస్థాయి ప్రమాణాలు ఉండాల్సిందే
- టెక్నాలజీతో అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళికలు
- సమిష్టి కృషితో లాభాల బాటలో విశాఖ స్టీల్ ప్లాంట్
- మంత్రుల, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందినట్టుగా భావించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని... వాటిని నిబద్ధతతో క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంటుందన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాకులో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలపై చర్చించారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఇక రియల్ టైమ్ గవర్నెన్సులో భాగంగా అవేర్, డేటా లేక్ సహా పాలనలో ఏఐ టూల్స్ ఇతర సాంకేతికత వినియోగంపై సమావేశంలో ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూయర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నెల వారీగా సమీక్షించుకోవాలి, క్షేత్రస్థాయిలో పనుల్ని బేరీజు వేసుకోవాలి. ప్రతీ నెలా 2 సార్లు కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ ద్వారా ప్రాజెక్టులకు ఆమోదం ఇస్తున్నాం. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇంఛార్జ్ మంత్రులు కూడా అదే వేగంతో పనులు జరిగేలా చూడాలి. గత 19 నెలల్లో ఏపీలో చేపట్టిన కార్యక్రమాలు, టెక్నాలజీ సహా ఏఐ అప్లికేషన్ల వినియోగం ఎలా జరుగుతుందో అంచనా వేసుకోవాలి. ప్రతీ మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి... పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నాం. ఇలా ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏమేరకు చేరుకున్నామన్నదానిపై స్పష్టతతో ఉంటున్నాం. గడచిన 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం. వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. తల్లికి వందనం ద్వారా రూ.10 వేల కోట్ల తల్లుల ఖాతాల్లో వేశాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మొబిలిటి పెరిగింది... 4.29 కోట్ల మేర ఉచిత ప్రయాణాలు ఇప్పటి వరకూ జరిగాయి. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే ఆక్యుపెన్సీ పెరిగింది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించాం. రాయలసీమలో హార్టి కల్చర్ హబ్, కోస్తాలో ఆక్వా కల్చర్ పెంచేలా చర్యలు చేపట్టాం. రైతు ఆత్మహత్యలనేవి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం... ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే... వాటిని అధ్యయనం చేసి రైతులను ఆదుకుంటున్నాం. దీపం 2.0 ద్వారా 4 విడతల్లో 3.64 కోట్ల గ్యాస్ సిలెండర్లు ఇప్పటి వరకూ ఇచ్చాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించాం. సంక్షేమ పథకాలు అవసరమా...? అనే చర్చ సరికాదు... పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే"అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

**వివాదాలు సృష్టించారు... 22ఏలో పెట్టేశారు..** "రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాం. పేదవాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా డ్రైవర్లకు మేలు చేస్తున్నాం. రూ.1,100 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా రైతులను ఆదుకుంటున్నాం. ధాన్యం కొనుగోళ్లకు కూడా రూ.10 వేల కోట్ల మేర 48 గంటల్లోనే చెల్లింపులు చేశాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇస్తున్నాం. తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిపాడ్ కోసం ఓ ప్రైవేటు భూమిని అక్రమంగా 22 ఏలో పెట్టేశారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఈ తరహాలో అధికారం దుర్వినియోగం చేశారు. ఇది ఒక్క తాడేపల్లిలోనే కాదు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకుంది. భూవివాదాలు లేకుండా... పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలను అందిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటి వరకూ రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. క్వాంటం వ్యాలీకి ఇటీవలే శంకుస్థాపన చేసి అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా మారుస్తున్నాం. విశాఖలో గూగుల్‌తో పాటు ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి. మొత్తం 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు రాబోతున్నాయి. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీకి కూడా కార్యాచరణ మొదలైంది. విద్యుత్ రంగంలో ట్రూ అప్ నుంచి ట్రూడౌన్ చేసే పరిస్థితికి వచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 5757 మంది కానిస్టేబుళ్ల నియామకం కూడా పూర్తి చేశాం... వారి స్టైఫండ్ రూ.4500 నుంచి రూ రూ.12,500కు పెంచాం. మార్చిలోగా రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

# బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే

### ఆయనే వారికి దేవుడు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవాలని అన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. దక్షిణాదిను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తున్నారని, ఈ వివక్షపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. భారీ ప్రాజెక్టులు అన్నీ ఉత్తరాదికే వెళుతున్నాయని ఆరోపించారు. కేంద్రం కొత్తగా ఇచ్చిన ప్రాజెక్టులు ఏవీ లేవన్నారు. పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నారని, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ తెలంగాణను పాలించిందని, కానీ వారు చేసిందేమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

# ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడాలి

- రాష్టానికి ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి ముందుకు వెళ్తున్నాం
- నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో అలసత్వం వద్దు
- క్షేత్ర స్థాయిలో ఇంకా కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి
- ఉదాసీనత వీడండి.. పారదర్శకతే మా విధానం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** 'కూటమి ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన, అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు నిబద్ధతతో పని చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అనుభవం మార్గదర్శకాలుగా ముందుకు వెళ్తున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉంద'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. నాలుగు గోడల మధ్య మంత్రులు, ఉన్నతాధికారులు తీసుకునే ప్రజోపయోగ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అర్థవంతంగా అందాలంటే అంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, శాఖల కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజీపడటం లేదు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయి విలువైనదే. పెట్టే ఖర్చు, దానివల్ల అందే ప్రయోజనం ప్రజలకు ఉపయోగపడేలా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయాలి. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి.

**రూ.వేల కోట్ల పనులను మొదలుపెట్టాం..** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన మీద దృష్టిపెట్టాం. దీనిలో భాగంగా మొదటి విడత పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.2,500 కోట్లు, పల్లె పండుగ 2.0 కింద రూ.5,700 కోట్లు ఖర్చు చేశాం. గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపర్చే కార్యక్రమం 'అడవి తల్లి బాట' పథకం కింద రూ.1005 కోట్లను వెచ్చించాం. దీంతోపాటు సాస్కీ నిధులు రూ.2,123 వేల కోట్లతో నియోజక వర్గాల్లో ప్రాధాన్యతను బట్టి పనులు చేస్తున్నాం. మొత్తంగా రూ.11,328 కోట్లతో చేస్తున్న పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం అప్పగించిన పనిని నిబద్ధతతో నిజాయతీగా పూర్తి చేయండి. ప్రభుత్వ నిర్ణయాల అమలు, పనులు జరుగుతున్న తీరు విషయంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. దీనిని అధిగమించాలి. ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి పనుల పూర్తి విషయంలో దిశానిర్దేశం చేయాలి. నిర్ణయాలను అమలు చేసే బృహత్తర బాధ్యతలు క్షేత్రస్థాయి సిబ్బంది మీదనే ఉన్నాయి. దాన్ని సరైన రీతితో నిర్వర్తించండి. ప్రభుత్వం మీకు తగిన విధంగా సహకరిస్తుంది" అన్నారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్...

- మరో కేసులో మళ్ళీ అరెస్ట్



**విజయవాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు అయింది.అంబటికి గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ లభించి ఆయన బయటకు వస్తారని భావిస్తున్న సమయంలోనే, పట్టాభిపురం పోలీసులు గతంలో నమోదైన మరో కేసులో ( పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలు) ఆయనను పీటీ వారెంట్ పై కోర్టులో హాజరుపరిచారు. ఈ రెండో కేసును విచారించిన స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు, అంబటి రాంబాబుకు 14 రోజుల పాటు (ఫిబ్రవరి 22 వరకు) రిమాండ్ విధించింది. అంబటి రాంబాబుపై ఏపీ వ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 52 కేసులు నమోదైనట్లు సమాచారం. సీఎంపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఆయనను ఫిబ్రవరి 1న పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుండి ఆయన రాజమహేంద్రవరం జైలులోనే రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. మొత్తానికి, ఒక కేసులో బెయిల్ దొరికినా మరో కేసులో రిమాండ్ పడటంతో అంబటి రాంబాబును పోలీసులు తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలిస్తున్నారు.

**చెరుకు రసం బండిపైనే ఆమె జీవన పోరాటం..!**

- 8లో

# ఉద్యోగాన్ని ఇష్టంగా చేసిన వ్యక్తి సమాచార శాఖ "కె వెంకటేశ్వరరావు"

### -ఏపీఎంపీఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్.



**మచిలీపట్నం, ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** మచిలీపట్నం సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తు ఇటీవల రిటైర్డ్ అయ్యిన వెంకటేశ్వర రావు ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ సోమవారం సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తున్న కొల్లూరు వెంకటేశ్వరరావు ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి విశ్వసనీయతతో, బాధ్యతాయుతంగా నిర్వహించారని, కష్ట సమయాల్లో కూడా ఉద్యోగ బాధ్యతలను ఇష్టపడి చేశారని ఆయన సేవలను కొనియాడారు. దాదాపు 31 ఏళ్ల పాటు అంకితభావంతో తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం గొప్ప విశేషమని, ఆయన నిబద్ధత, సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకం అన్నారు. వెంకటేశ్వరరావు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని అభిలాషించారు. ఆయనతో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. సీనియర్ జర్నలిస్టులు మరియు కృష్ణా జిల్లా మీడియా అక్రిడిషన్ కమిటీ సభ్యులు మన్నే సోమేశ్వరరావు ,మత్తి శ్రీకాంత్ , జీ. శ్యామ్ బాబు , ఏపీఎంపీఎ నాయకులు రాజు , బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HONBLE IV ADDL DISTRICT JUDGE CUM PRL FAMILY JUDGE COURT AT VIJAYAWADA**

FCOP NO 590 OF 2025

Between :

AKULA SARANYA --------Petitioner

AND

AKULA JENARDHANA RAO --------Respondent

**Respondent-Address :**

AKULA JANARDHANA RAO. S/o PEDDHA MASTAN DNO 1-28- CHATLA VARI STREET, RUPAI BULDING - OPPSITE ROAD, KAVALI TOWN, NELLURU DISTRICT, EDITION, ANDHRA PRADESH.

పై తెలిపిన FCOP NO : 590 OF 2025, కేసులో రెస్పాండెంట్ అయిన మీకు పై పిటిషన్‌లో మీకు NOTICE @ SUMMONS పంపించగా సదరు నోటీసులు తీసుకొకుండా మీరు ఉద్దేశపూర్వకముగా, కాలయాపన చేస్తున్నారు. ఈ పేపర్ ప్రకటన ద్వారా సదరు పిటిషన్ సంగతులు తెలియజేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఆదేశించియున్నారు. కావున తేది 12 మార్చి 2026వ తేదీన మీరు ఉదయం 10.30ని॥లకి స్వయముగా గాని లేదా ప్లీడర్ గారు ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి, మీ యొక్క అభ్యంతరములు తెలుపుకొనవలెయును లేనిచో మీపై కోర్టు వారు పరోక్షంగా విచారించి తీర్మానంచెదరు. అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము**

**వాయిదా తేదీ : 12-03-2026**

ఇట్లు

**Allada Rama Krishna**

Advocate,

Cell No. 9949 191 792

Dated : 12-03-2026

VIJAYAWADA


# ట్రాన్స్ ఫార్మర్ వద్ద భద్రత లోపం..

## తీవ్రంగా గాయపడిన బాలుడు



**కూకట్ పల్లి,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కూకట్ పల్లి డివిజన్ లోని ప్రగతి నగర్ లో ట్రాన్స్ఫారం దగ్గర కరెంటు షాక్ కు గురైన బాలుడు రాహుల్ సుమిత్ర నగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతుంది. గత ఐదు నెలల క్రితం బతుకుతెరువు కోసం ప్రగతి నగర్ లో నివాసం ఉంటూ పక్కనే ఉన్నాను ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. దీనిలో భాగంగా నిన్న పతంగి కోసం వెళ్తూ కరెంటు షాక్కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో బాలుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు కుటుంబం పోషణ కోసం తండ్రి రాపిడో చేస్తూ జీవనం సాగిస్తుండగా ఈ విషాదం జరగడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రెండు రోజులు గడిస్తే కానీ ఏమి చెప్పలేమని ఆసుపత్రి వైద్యులు చెప్పినట్లు వారు వాపోయారు. ప్రభుత్వం తమ గోడును ఆలకించి మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి తమకు సహాయం అందించాలని కోరారు.

# శ్యామ్ ఇనిస్టిట్యూట్ లో ఘనంగా జరిగిన గ్రూప్-2 విజేతల విజయోత్సవ సభ



**కాకినాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఒక బ్రాండ్గా నిలిచిందని, కేవలం పోలీస్ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఉద్యోగాలలోనూ శ్యామ్ ఇనిస్టిట్యూట్ విజయకేతనం ఎగురవేయడం అభినందనీయమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, జనసేన నాయకులు పంతం సందీప్ అన్నారు. ఇటీవల విడుదలైన ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ఫలితాలలో 94 మంది శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ఉద్యోగాలను సాధించడం అభినందనీయమని కొనియాడారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్లో ఆదివారం నాడు గ్రూప్-2 విజేతల విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ విజయోత్సవ సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రాజశేఖరం, జనసేన నాయకులు పంతం సందీప్లు హాజరై మాట్లాడారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్ ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో ఉన్నతమైన విలువలతో ఇనిస్టిట్యూట్ను తీర్చిదిద్దడంతో అనేకమంది పేద విద్యార్థులకు ఉద్యోగాలు అందించే సంస్థగా ఆవిర్భవించిందని అన్నారు. కాకినాడ వంటి నగరంలో ఇనిస్టిట్యూట్ను స్థాపించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో సత్తా చాటడం ఈ ప్రాంతానికే ఈ సంస్థ తలమానికంగా ఉండడం గర్వించదగిన విషయమని అన్నారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో బోధిస్తూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా వేలాది కుటుంబాలలో వెలుగులు నింపుతున్నారని అన్నారు. ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్, డైరెక్టర్ శైలజలు మాట్లాడుతూ శ్యామ్ ఇనిస్టిట్యూట్ కేవలం పోలీసు ఉద్యోగాలకే పరిమితం కాకుండా గ్రూప్స్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించే విధంగా ప్రణాళికలు రూపొందించడం తోనే తొలి ప్రయత్నంలోనే ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఫలితాలలో 94 పోస్టులను మా విద్యార్థులు కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇనిస్టిట్యూట్ ప్రారంభించిన 25 ఏళ్లలో 26 వేలకు పైగా ఉద్యోగాలు సాధించగలిగామని, 2023-25 ఈ రెండేళ్లలో 7210 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. ఈ ఫలితాలు సాధించడానికి ప్రధానంగా డైలీ టెస్ట్లు, వీక్లీ టెస్ట్లు క్రమం తప్పకుండా నిర్వహించడం, నిష్ణాతులైన ఫ్యాకల్టీలతో నాణ్యమైన విద్యను అందించడమేనన్నారు. గ్రూప్-2 ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్ సార్ విద్యార్థులకు ఉన్నతమైన బోధనతోపాటు మోటివేషన్ అలాగే భరోసా, ఆత్మస్థైర్యం కల్పించడంతోనే ఈ ఉద్యోగాలు సాధించగలిగామని, అనునిత్యం శ్రమిస్తూ చక్కటి మెటీరియల్ అందించి మా జీవితాలలో వెలుగులు నింపారని అన్నారు. అనంతరం గ్రూప్ -2 ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి శ్యామ్ కృతజ్ఞతలు తెలిపారు.

# పెదపాలపర్రులో ఘనంగా 1987 పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక

## డాక్టరేట్ పొందిన సహ విద్యార్థి బొప్పన రవి కుమార్ కు అభినందన




**ముదినేపల్లి (పెదపాలపర్రు),ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు ఈఎస్ సీ ఎం జెడ్ పి హెచ్ పాఠశాల 1987 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్నేహ సమావేశం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు తమ బాల్య జ్ఞాపకాలను, పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అప్పటి గురువుల బోధనలు, స్నేహ బంధాలు, బడి ప్రాంగణంలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని పరస్పరం అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారు తమ జీవితాల్లో పోషించిన పాత్రను స్మరించారు. గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధి, భవిష్యత్ తరాలకు మంచి విద్య అందించాల్సిన అవసరంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టరేట్ పొందిన నాటి సహచర విద్యార్థి , సీనియర్ జర్నలిస్టు బొప్పన రవి కుమార్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రవి కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. పెదపాలపర్రు స్కూల్ నుండి డాక్టరేట్ పొందిన తొలి వ్యక్తి గా రవి కుమార్ నిలిచారని ఈదర సీతారామయ్య తెలిపారు. ఇది తమ బ్యాచ్ కు ఎంతో గర్వకారణమైన విషయమని నెక్కంటి చౌదరి ప్రస్తుతించారు. కార్యక్రమంలో శ్రీను, రామ్మోహన్, వేణు, లక్ష్మి రాణి, నాగ లక్ష్మి, ఉమ, ఉష, రమ, లక్ష్మి కుమారి, పద్మ, కమల, శ్రీదేవి, సుశీల తదితరులు పాల్గొన్నారు. స్నేహ సమావేశంలో భాగంగా జ్ఞాపికల మార్పిడి, పాత ఫోటోలతో జ్ఞాపకాల తాలూకు అనుభూతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఈ సమావేశాన్ని జీవితంలో మరచిపోలేని అనుభూతిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధం మరింత బలపడిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలను నిర్వహించాలనే సంకల్పం వ్యక్తం చేశారు.

# రైతు బజార్ అన్నా క్యాంటీన్ ల ఏర్పాట్లకు ప్రజలు ఎదురుచూపులు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఒకవైపు ఓటర్ల జాబితా ప్రక్రియ ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చివరి అంకానికి వస్తూ ఉండటంతో సమకాలీన రాజకీయ ఆర్థిక సాంకేతిక మరియు సామాజిక పరిస్థితులను అంచనా వేస్తూ రాజకీయ మేధావులు చాప కింద నీరుల పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభమైందని ఓటర్ల జాబితా తయారీ కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేయటం జనవరి ఒకటవ తేదీ ప్రామాణికంగా ఓటర్ల జాబితా నవీకరించాలని మార్చి 9వ తేదీ నాటికి ఓటర్ల జాబితా ప్రకటించాలని కలెక్టర్లను ఆదేశించటం జరిగింది. గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుండటంతో పోల్ మేనేజ్మెంట్ లో అపార అనుభవం కలిగిన రాజకీయ చాణక్యులు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు గెలుపు గుర్రాలను సామాజిక సమీకరణాలకు అనుగుణంగా రంగం సిద్ధం చేస్తున్నట్టు పలుచోట్ల అనుకుంటున్నారు. ఓటర్ల జాబితా తయారీ వెంటనే ప్రారంభించాలని మార్చి 9వ తేదీ నాటికి ఫోటోలతో సహా ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని కలెక్టర్లకు ఈసీ ఆదేశాలు అందడంతో మరోవైపు సీఈఓ కార్యాలయం నుండి అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలో సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం వివరాలను సర్వర్లలో రికార్డు చేసినట్టు తెలుస్తోంది.20 26 జనవరి 1వ తేదీ ప్రామాణికంగా తీసుకున్న వాటర్ల జాబితా అప్డేట్ చేయాలని సూచించడంతో ఏపీలో 13 3 51 గ్రామపంచాయతీలలో ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. విస్సన్నపేట గ్రామపంచాయతీ ప్రస్తుతం నడుస్తున్న సర్కిల్ ప్రకారం ఎస్సీ మహిళా లేదా బీసీ మహిళ రిజర్వేషన్లలో ఒకటి ఫైనల్ అయ్యే పరిస్థితి ఉన్నదని ఇప్పటికే రాజకీయ పార్టీలు అదే లక్ష్యంగా గత కొంతకాలంగా వినాయక చవితి,దసరా, సంక్రాంతి, దుర్గాష్టమి తదితర పండగల సమయాలలో బహుమతులు అందిస్తూ అన్న సమారాధన కార్యక్రమాలకు మరియు విగ్రహ ప్రతిష్ట లకు విరాళాలు ఇవ్వటం జరుగుతుందని ఓటు బ్యాంకు ను ఒడిసి పట్టుకునే లక్ష్యంగా ఆశావహులు తెర వెనక రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సర్వత్రా వినిపిస్తుంది. మరికొందరు వార్డుల వారీగా సామాజిక వర్గాల వారీగా బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేస్తూ పేద కుటుంబాల అభిమానాలను సంపాదించుకున్న విశ్వసనీయవర్గాల సమాచారం ఉన్నది. మరోవైపు మండల కేంద్రంలో రైతు బజార్ అన్నా క్యాంటీన్ లను ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. కొంతమంది సీనియర్లు ఐక్యతతో పోటీ చేస్తే గెలుపు తమ్మితేనని ఎడమొఖం పెడ ముఖం గా ఉంటే గెలుపు కష్టమవుతుందని సామాజిక వర్గాల పరంగా గణాంకాలను లెక్కించడం జరుగుతోంది. 20 24 జోష్ తో అన్ని పంచాయతీలు కూటమి పార్టీలు తెలుసుకోవాలని పథక రచన చేస్తూ ఉంటే మరోవైపు ప్రతిపక్ష వైసిపి ఇప్పటికే తమ చేతిలో ఉన్న గ్రామ పంచాయతీలతోపాటు అదనంగా మిగిలిన గ్రామపంచాయతీలను కూడా తమ ఖాతాలో వేసుకోవాలని స్కెచ్ రెడీ చేసుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

## -విజయవాడ ఆర్టిఏ అధికారి ఆలీ



**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థల మీటింగ్ హాల్ నందు రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాంను విజయవాడ ఆర్టిఏ అధికారి ఆలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధార్థ వికాస్ శ్రీశ్రీ విద్యాసంస్థల డ్రైవర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రపంచంలో అత్యధిక ప్రమాదాలు ఇండియాలో జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరం తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. గుట్కా గంజాయి డ్రింకింగ్ సిగరెట్ వంటి మత్తు పదార్థాల వలన ఏ అలవాటు లేని డ్రైవర్ల మెదడు పనితీరు కన్నా వీరిది మందంగా ఉంటుందని దానివలన చురుకుగా స్పాట్ నిర్ణయాలు ప్రమాదం జరిగే సమయంలో తీసుకునే సమయంలో ఆలస్యం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని ఈ విషయం స్కూల్ వ్యాన్ డ్రైవర్లకే కాకుండా విద్యార్థులకు కార్మికులకు ఖర్చులకు పారిశ్రామికవేత్తలకు టు వీలర్స్ ఫోర్ వీలర్స్ టెన్ టైర్స్ అంతకుమించి వాహనాలు నడిపే వారందరికీ కూడా వర్తిస్తాయన్నారు. రోడ్డు ప్రమాదంలో కాపాడిన డ్రైవర్లకు కేంద్ర ప్రభుత్వం 25వేల రూపాయల క్యాష్ అవార్డుతో సర్టిఫికెట్ అందిస్తారని అన్నారు. వాహన ప్రమాదం జరిగినప్పుడు స్కూల్ బస్సుల ద్వారా విద్యార్థులను అత్యవసర మార్గం నుండి ఏ విధంగా బయటకు తీసుకురావాలనే విషయాలపై రిక్కీ నిర్వహించారు. శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత మేడా మోహనరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్య ఎంత అవసరమో విద్యాసంస్థల నుండి సంబంధిత విద్యార్థులను వారిని భద్రంగా బస్సులలో తీసుకువెళ్లే వారి ఇంటి వద్ద వారి తల్లిదండ్రులకు వారిని అప్పజెప్పడం కూడా అంతే చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో బ్రీత్ ఎనలైజర్ల ను ఏర్పాటు చేస్తున్నామని మత్తు పదార్థాలు వాడిని వాళ్లను విధులు నుండి తొలగిస్తామని ఏ అలవాటు లేని వాళ్ళని మాత్రమే విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థికి బస్సు ప్రయాణం భరోసా కల్పిస్తూ వారి తల్లిదండ్రులకు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భావితరాలలో బాటలు వేసే విధంగా వారి ఆనంద పరమపద సోపానానికి తాము కారకులం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థల డ్రైవర్లు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన శ్రీనివాస డిజిటల్ స్టూడియో

## -ఫోటోగ్రఫీ రంగంలో మరో మైలురాయి సాధించిన గంటా శ్రీనివాస్






**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** హైదరాబాద్లో శనివారం ఘనంగా నిర్వహించిన ఇండియన్ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫోటో ఫినా--2026 అవార్డ్స్ ప్రదానోత్సవంలో హనుమాన్ జంక్షన్కు చెందిన శ్రీనివాస డిజిటల్ స్టూడియో అధినేత గంటా శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మకమైన "వెడ్డింగ్ ఫోటోగ్రఫీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు" లభించింది. వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో సృజనాత్మకత, నాణ్యతా ప్రమాణాలు, వినూత్న ఆలోచనలు, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నందుకు ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్న గంటా శ్రీనివాస్, ఈ తాజా అవార్డుతో తన ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ఈ అవార్డును జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ కమల్ రాయ్, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోసిన వీరేంద్ర కుమార్, కార్యదర్శి మద్దాల శేఖర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రముఖ సినీ కమెడియన్, మాజీ మంత్రి బాబు మోహన్ ప్రత్యేకంగా గంటా శ్రీనివాస్ను అభినందిస్తూ, ఫోటోగ్రఫీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్ ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి విజయ్ కుమార్, కార్యదర్శి తాడి రంగారావుతో పాటు సభ్యులు శ్రీనివాస్ను ఘనంగా అభినందించారు. స్థానికంగా చిన్న పట్టణం నుంచి జాతీయ స్థాయికి ఎదిగి అవార్డు అందుకోవడం హనుమాన్ జంక్షన్కు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఒక్కసారి మైండ్ లో ఫిక్స్ అయితే నా మాట నేనే వినను పోకిరిల ఆట కట్టిస్తాను - ఎస్ఐ అర్జున రాజు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో శ్రీ శ్రీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఇంటర్ విద్యార్థుల ఫేర్వెల్ పార్టీకి ఎస్ఐ అర్జున రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనకు పట్టు శాలవాతో సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండలతో ఎస్ ఐ అర్జునరాజుకు విశ్రాంత ప్రిన్సిపాల్ ముంగా జయరాజుకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి తరం బాలికలు చిరిగిన బట్టలతో మాచిన జుట్టుతో చదువు అబ్బక గంజాయి హెరాయిన్ గుట్కాలు మందు తదితరాలకు అలవాటుపడి పోకిరి వేషాలు వేసే వాళ్లను ఇష్టపడుతున్నారని అన్నారు. లైసెన్స్ లేకుండా చిన్నపిల్లలు కూడా వాహనాలు నడుపుతున్నారని అంతే కాకుండా పల్లె ప్రాంతాలని కొందరు హెల్మెట్లు వాడటం లేదని కారులపై ప్రయాణించి వారు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ప్రతి ఒక్కరు నిబంధనలను పాటించాలని తాను ఒక్కసారి ఫిక్స్ అయితే చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకునేందుకు ఎలాంటి అడుగు వెనకకు వేయను అని అన్నారు. స్నేహం బంధం ఎంతో తీయనదని అని ఇంటర్ విద్య పూర్తి చేసుకున్న మీరు ఇతర కోర్సులు కొరకు వెళుతూ ఉంటారని అయితే మంచి వ్యక్తి స్నేహం వలన మంచి అలవాట్లు మీకు వస్తాయని చెడు వ్యక్తి స్నేహం వలన దుర్వేశనాలు మీకు అలవాటు అవుతాయని గాశీష్ఠ సన్మార్గంలో పయనించేందుకు ప్రతి ఒక్కరు ఆచీ తూచి అడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థ డైరెక్టర్లు పూర్ణ, ఆర్పి రాజేశ్వరరెడ్డి లతోపాటు విశ్రాంత ప్రిన్సిపాల్ ముంగ జయరాజు మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. జరిగిపోయిన తరగతి గదుల ముచ్చట్లను అందరూ గుర్తు చేసుకున్నారు.

# సర్పంచ్ కాటూరి విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం





**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో పిన్నమనేని డెంటల్ మెడికల్ కాలేజీ వారి సౌజన్యం తో దంత వైద్య ప్రొఫెసర్స్ డా మాధురి, డా పల్లవి సమంత,వారి వైద్య సిబంధి చేత ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసారు.సుమారు 220 మందికి దంతాలు శుభ్రపరచడం,దంత సమస్యలు చూడటం,అవసరమైనా మందులు ఇవ్వడం, వైద్య సేవలు పూర్తి ఉచితంగా చేశారు. సమస్య తీవ్రత ను బట్టి కొంత మందికి హాస్పిటల్ కి రమ్మని అక్కడ కూడా పూర్తి ఉచితంగా వైద్యం చేసేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ శిబిరాన్ని మండల పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు చేతుల మీదగా ప్రారంభించారు. అనంతరం విజయ్ భాస్కర్ పుట్టినరోజు సందర్భంగా హనుమాన్ జంక్షన్ ఆశాజ్యోతి దివ్యాంగులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్,పార్టీ ప్రెసిడెంట్ వేగే కృష్ణారావు,సెక్రటరీ గొల్లపూడి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గండేపూడి నితీష్, ఉపాధ్యక్షుడు దాసరి రాజేష్ దంత వైద్యులు, పంచాయితీ ఈఓ,సచివాలయ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

# పెడన లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పేషెంట్ లకు ఫ్రూట్స్ రొట్టెలు పంపిణీ



**పెడన,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ప్రతి నెల 9 వ తారీకు పెడన లయన్స్ క్లబ్ ఆధ్వర్యములో గర్భిణీ స్త్రీలకు రోగులకు పోషకాహార పంపిణీ కార్యక్రమం జరగనుంది.పెడన లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రతినెల 9వ తారీఖున జరుగు గర్భిణీ స్త్రీల హెల్త్ చెకప్ నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలకు గూడూరు ఓంకారేశ్వర శర్మ సహకారంతో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పెడన లైన్స్ క్లబ్ అధ్యక్షులు బెజవాడ నాగరాజు జయలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ యర్రపోతు నాగేశ్వరరావు పెడన లయన్స్ క్లబ్ కోశాధికారి మామిడి ప్రసాద్ లయన్స్ క్లబ్ సభ్యులు చోడవరపు అప్పారావు వెలివుల రాఘవులు రాయన లక్ష్మీ, జల్లూరి కోటేశ్వరావు పామర్తి పైడేశ్వరరావు జంపాన శ్రీను బోలెం భగవాన్ సత్యసాయి సేవా సమితి సభ్యులు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా శ్రీ కనకదుర్గమ్మ 26వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు



**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో ఏ కొండూరు రోడ్ లో ద్వారకా నగర్ లో శ్రీ కనకదుర్గ అమ్మవారి 26వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంధం సత్యశ్రీ హనుమంతురావు, కుక్కడపు ప్రసాదరావు, సానం నాగేంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదశీ స్వీకరించారు. విశ్రాంత టెలిఫోన్ ఉద్యోగి వై నరసింహారావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వాసిరెడ్డి శంకర భవాని కి నివాళులు అర్పించిన వంగవేటి ఆశా కిరణ్



**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీ తిరుతమ్మ ఆలయ మాజీ చైర్మన్ అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బేనార్జీ సతీమణి శ్రీమతి వాసిరెడ్డి శంకర భావాని గత నాలుగు రోజులు క్రితం అన్నారోగ్యం తో మృతి చెందగా సోమవారం విజయవాడ కు చెందిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ వాసిరెడ్డి వారి నివాసానికి వచ్చి శంకర భవాని చిత్ర పటాని కి పూలు వేసి ఘనంగా నివాళ్లులు అర్పించారు. వారి కుటుంబానికి సంతాపం తెలియ చేశారు. అలాగే బేనార్జీ ని అధైర్య పడ కండి ఇలాంటి సమయంలో ధైర్యం గా వుండాలని సూచించారు.మా కుటుంబానికి బేనార్జీ కుంటుబానికి, మా అ మ్మమ్మ మాజీ ఎంపీ చెన్ను పాటి విద్య ఉన్న దగ్గర నుండి మా రెండు కుటుంబాల బంధుత్వాలు వున్నాయని వంగవీటి ఆశా కిరణ్ విలేకర్లకు తెలిపారు..

# అయ్యప్ప స్వామి ఆలయంకు 50,000 వేల రూపాయలు విరాళం అందించిన నూలు నరసింహారావు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న శ్రీ హరిహరసత అయ్యప్ప స్వామి వారి దేవస్థానం నిర్మాణానికి హనుమాన్ జంక్షన్ కు చెందిన అన్నపూర్ణా ఏజన్స్ అధినేత నూలు నరసింహారావు ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం 50,116. వేల రూపాయలు విరాళం అందించారు.వారికి ఆలయ కమిటీ చైర్మన్ లయన్ గూడపాటి రత్నశేఖర్,కొల్లి వెంకటరావు,కాకుల శ్రీనివాసరావు, గూడవల్లి చిన్నా, వీరమాచినేని నాగయ్య , తదితరులు దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాత నూలు నరసింహారావు జన్మదినం పురస్కరించుకొని శాలువాతో సన్మానించారు.

# ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కోడూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేస్తారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ 15వ ఫైనాల్స్ రూ.36లక్షల నిధులతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సర్పంచ్ దేవన బోయిన కనకదుర్గ, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మిదాని కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కు ప్రారంభం: సుధీర్ రెడ్డి.



**ఎల్బీనగర్/ వార్త ప్రభ (ఫిబ్రవరి 9)**:హయత్ నగర్ డివిజన్ పరిధిలోని మిదాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఇప్పటికే దశలవారీగా పరిష్కరించామని, మిగిలిన సమస్యలను కూడా ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రజక సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం



**మల్కాజిగిరి : ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రజక సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని శ్రీ దుర్గా భవాని రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రసమొల్ల యాదగిరి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ లో శ్రీ దుర్గాభవాని రజక సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి ఇతర అంశాలపై చర్చించామని అధ్యక్షులు తెలిపారు అనంతరం సంఘం 2026 సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ముత్యం యాదగిరి, కార్యదర్శి వడ్డే మాన్ సతీష్, సంయుక్త కార్యదర్శి ఎర్రోళ్ల తిరుపతి, కోశాధికారి ర్యగల్లా శంకర్, సలహాదారులు కొలనుపాక శ్రీకాంత్, వైనాల ప్రవీణ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం వీధుల్లో కాంగ్రెస్ సునామి

***- ఎమ్మెల్యే రంగారెడ్డి భారీ ర్యాలీతో మారిన రాజకీయ సమీకరణాలు.***



**ఎల్బీనగర్/ వార్త ప్రభ (ఫిబ్రవరి 9)**:ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీతో పట్టణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీ ఇబ్రహీంపట్నం రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేసిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మహిళలు, యువత, అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొనడంతో ర్యాలీ పట్టణమంతా ఉత్సాహంగా మారింది. కాంగ్రెస్ జెండాలతో వీధులు కప్పుకుపోయి, "కాంగ్రెస్ గెలుపు ఖాయం", "రంగారెడ్డి మా నాయకుడు" అనే నినాదాలతో ఇబ్రహీంపట్నం మార్మోగింది. ప్రజల నుంచి వెల్లువెత్తిన మద్దతుతో కాంగ్రెస్ బలం మరోసారి స్పష్టంగా బయటపడింది.ఈ ర్యాలీతో బీఆర్ఎస్, బీజేపీ నేతల విమర్శలకు కాంగ్రెస్ గట్టి సమాధానం చెప్పినట్లయిందని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజలతో నేరుగా మమేకమయ్యే నాయకత్వమే కాంగ్రెస్‌కు బలమని ఎమ్మెల్యే రంగన్న స్పష్టం చేశారు."ప్రజలే మా శక్తి... ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం" అంటూ ధీమా వ్యక్తం చేశారు.ఈ భారీ ర్యాలీతో కాంగ్రెస్ శక్తి, ప్రత్యర్థుల బలహీనత బహిర్గతమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ దూకుడు చూస్తుంటే మున్సిపాలిటీపై హస్తం ముద్ర పడటం కేవలం సమయ సమస్య మాత్రమే అన్న చర్చ జోరుగా సాగుతోంది.

## వెస్ట్ ఆగమయ్య నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 9)**:మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ఆగమయ్య నగర్ కాలనీలో రెయిన్ వాటర్ ట్రంక్ లైన్, సీసీ రోడ్డు పనులను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., గతంలో చిన్నపాటి వర్షానికే కాలనీలు జలమయం అయ్యేవని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఆ సమస్యలు పూర్తిగా పరిష్కరించామని తెలిపారు. నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చేపడతామని, అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ నాయకులు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసంసిపిఎం,కాంగ్రెస్ అభ్యర్థినులను గెలిపించండి.

**21,22 డివిజన్లలో భారీ ర్యాలీ.**






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్:2026, ఫిబ్రవరి 09: 21,22, డివిజన్లలో సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులు చింతలపూడి శ్రావణి,లింగం పుష్పావతిలకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగా సీతారాములు, మాజీ సొసైటీ అధ్యక్షులు మండే వీరహనుమంతరావులు విజ్ఞప్తి చేశారు, సోమవారం నాడు చివరి రోజు ప్రచారంలో భాగంగా 21,22 డివిజన్ల పరిధిలో అంబేద్కర్ సెంటర్ నుంచి సుజాతనగర్ మెయిన్ రోడ్డు మీదుగా నాయకులగూడెం వరకు భారీ ర్యాలీ గా వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల కమిటీ సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు,ఈ సందర్భంగా సుజాతనగర్ సెంటర్ లో జరిగిన సభలో వారు పాల్గొని మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు, సుజాతనగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్, సిపిఎం పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు, పేదలందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలు సాధిస్తామని అన్నారు, జిల్లా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ల సహకారంతో రోడ్లు, మంచినీటి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు, ప్రచారంలో భారీగా పాల్గొన్న ప్రజలకు అభినందనలు తెలిపారు.కాంగ్రెస్,సిపిఎం, తెలుగుదేశం ఐక్యంగా చింతలపూడి శ్రావణి, లింగం పుష్పావతి ల గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు చారుగుండ్ల దేవిశ్రీప్రసాద్, కొత్తగూడెం సొసైటి మాజీ చైర్మన్ మండే వీర హనుమంతరావు బత్తుల వీరయ్య లింగం పిచ్చి రెడ్డి , బత్తుల రమేష్, అబిద్, మౌలాలి, నువ్వు వడుగు నరసింహరావు, రవీందర్ ,కిన్నెరి వెంకన్న,సాంబ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు రేపాకుల శ్రీనివాస్, యాసా నరేష్ కున్సోత్ ధర్మ గారు, పెద్ది వేణు నర్రా శివరామకృష్ణ,కాత్రాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

# మీధాని కాలనీలో రూ.1.36 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం.

**- ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**



**ఎల్బీనగర్/వార్త ప్రభ (ఫిబ్రవరి 9)**:హయత్ నగర్ డివిజన్ పరిధిలోని మీధాని కాలనీలో సుమారు రూ.1 కోటి 36 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్లు, పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ప్రారంభించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు, సంక్షేమ సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

**సాయి సిద్ధార్థ కాలనీలో రూ.26 లక్షల సీసీ రోడ్ల పనులకు**



**శంకుస్థాపన.** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి సిద్దార్థ కాలనీలో రూ.26 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీలో చాలా కాలంగా ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు, సంక్షేమ సంఘ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# తాగునీటి లోప్రెషర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కార్పొరేటర్ "రాగం"

**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి డివిజన్‌లో త్రాగునీటి లోప్రెషర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద హైప్రెజర్ బూస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గోపినగర్,నెహ్రూనగర్,బాపునగర్‌తో పాటు పలు బస్తీల్లో గత కొంతకాలంగా త్రాగునీరు లోప్రెషర్‌తో వస్తోందని స్థానికులు కార్పొరేటర్‌ను కోరగా, వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసి బూస్టర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.ముఖ్యంగా గోపినగర్ గుట్ట ప్రాంతం,నెహ్రూనగర్ పరిసర బస్తీలకు హైప్రెజర్ త్రాగునీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని,అందులో భాగంగానే త్రాగునీటి లోప్రెషర్ సమస్యను పూర్తిగా అధిగమిస్తున్నామని అన్నారు.ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహాయ సహకారాలతో శేరిలింగంపల్లి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్యైనా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి హాజరైన గోపినగర్,నెహ్రూనగర్ తదితర బస్తీ వాసులు త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన కార్పొరేటర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం నరేందర్,మేనేజర్ అభిషేక్ రెడ్డి,డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,వార్డు మెంబర్ పర్వీన్ బేగం,సీనియర్ నాయకులు,స్థానిక మహిళలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం

**- అడ్మిన్ డీసీపి సరిత - డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీకి జి.కొండూరు లో ఘన స్వాగతం**





**జి.కొండూరు:ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంకల్పంలో మనమందరం భాగస్వాములమవుదామని అడ్మిన్ డీసీపీ కె.జి. వి సరిత పిలుపునిచ్చారు .విజయవాడ సిపి ఎస్ వి రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు 35 రోజులపాటు కొనసాగనున్న డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో భాగంగా సోమవారం జి.కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం గ్రామం నుంచి ప్రారంభమై పినపాక శివారు విద్యానగరం మీదుగా జి.కొండూరు చేరుకున్న డ్రగ్స్ పై దండ యాత్ర సైకిల్ ర్యాలీ కి అడ్మిన్ డీసీపి కె జి వి సరిత, రూరల్ డీసీపి లక్ష్మీ నారాయణ,మైలవరం ఏసీపి వై.ప్రసాద రావు, మైలవరం సిఐ దాడి చంద్రశేఖర్, ఎస్ఐ సతీష్ కుమార్, ఎస్ఐ గిరిజమణి, మైలవరం ఎస్ ఐ సుధాకర్,ఐ డి సి డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని,టీడీపీ జిల్లా కార్యదర్శి పజ్జూరు రవికుమార్, ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ,టీడీపీ మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వేములకొండ వెంకటేశ్వరరావు లంక నాగేశ్వరరావు,పలువురు టీడీపీ నేతలు, స్థానిక మహిళలు, వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.సైకిల్ యాత్ర చేస్తున్న మహిళా పోలీసులకు స్థానిక మహిళలు హారతులు ఇచ్చారు.ఈ సందర్భంగా జి కొండూరు గ్రామంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాటు సభలో స్కూల్ చిన్నారులు డ్రగ్స్ పై ప్రదర్శించిన స్కిట్ లు చూపరులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా అడ్మిన్ డీసీపి కె జి వి సరిత, రూరల్ డీసీపి లక్ష్మీ నారాయణ,మైలవరం ఏసీపి వై.ప్రసాద రావు,మైలవరం సిఐ దాడిచంద్రశేఖర్, ఎస్ఐ సతీష్ కుమార్, ఐడి సి డైరెక్టర్ ఇందిరా ప్రియదర్శిని, ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ తదితరు లు ప్రసంగించారు.విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనంచేసుకోవద్దని కోరారు.ఎవరైనా డ్రగ్స్ కు బానిసలై బాదప డుతుంటే 1972 టోల్ ఫ్రీ నంబర్ కి డయల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసిన, అమ్మిన అటువంటి వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.మాదక ద్రవ్యాలకు మత్తు పదార్థా లకు బానిసలైతే ఎవరు బాగు చేయలేరని అన్నారు.డ్రగ్స్ బారినపడి ఎవరైనా ఇబ్బందులు పడుతుంటే అట్టి వారిని గుర్తించినట్లయితే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి బాగుపరచడానికి మంచి అవకాశం ఉంటుందని వెల్లడించారు.ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ పట్ల ఆకర్షితులవుతూ శారీరకంగా అనారోగ్యానికి గురవుతున్నా రని, కొంతమందిలో మానసికంగా మార్పులు జరిగి విచక్షణ కోల్పోయి దొంగతనం, హత్యలు, హత్యాచారం, ఇతరులపై దాడికి దిగటం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ జైలు పాలు అవుతున్నారని తెలిపారు.అలాంటి వ్యక్తులు కుటుంబానికి సమాజానికి అత్యంత ప్రమాదకరం అన్నారు. డ్రగ్స్ పై దండయాత్ర ర్యాలీ 510 కిలోమీటర్ల మేర ఉంటుందని, ఈ ర్యాలీ ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు సిడిపిఓ కె పుష్పలత, జి.కొండూరు సెక్టార్ సూపర్వైజర్ జోజి కటాక్షం, సెక్టర్ పరిధి లోని అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటు వేద్దాం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**



**ఆమనగల్/వార్త ప్రభ,(ఫిబ్రవరి 9)**:ఆమనగల్ మున్సిపాలిటీ 3వ, 4వ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల దోపిడీ పాలనకు, అభివృద్ధి--సంక్షేమ పాలనకు మధ్య ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.4వ వార్డులో రూ.6.40 కోట్ల వ్యయంతో వాటర్ ట్యాంక్, రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళా సంక్షేమ పథకాలను వివరిస్తూ, పేదల ఆత్మగౌరవమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల్లో మునిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు రూ.22,500 కోట్లు కేటాయించామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు.అలాగే రెండు సంవత్సరాల్లోనే గ్రూప్--1, 2, 3 పరీక్షలు పారదర్శకంగా నిర్వహించి 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో 3వ వార్డు అభ్యర్థి నేనావత్ విజయ, 4వ వార్డు అభ్యర్థి దుడ్డు కృష్ణ యాదవ్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## బాలాజీ నగర్ చాత్తాద వైష్ణవ సంఘం.... నూతన అధ్యక్షునిగా లక్ష్మణాచారి ఎన్నిక.



**జవహర్ నగర్ ఫిబ్రవరి 9: (వార్తా ప్రభ)**చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బాలాజీ నగర్ లో సోమవారం నూతన చాత్తాద సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా వకులాభరణం లక్ష్మణాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విజయపురి కృష్ణమూర్తి, రాధావరం అర్చన, కార్యదర్శిగా హరిపురి వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా పరాంకుశం, సాంప్రదాయ కార్యదర్శిగా హరిపురి అనిల్ ,కోశాధికారిగా తిరునగరి సింహాచలం ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ కార్యవర్గ సభ్యులకు బంధువులు బాలాజీ నగర్ శాఖ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వకులాభరణం లక్ష్మణాచారి మాట్లాడుతూ నామీద ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని చాత్తాద వైష్ణవ సంఘ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర చాత్తాద వైష్ణవ సంఘం సభ్యులు వకులాభరణం భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడ్డ చాత్తాద వైష్ణవ సంఘం సభ్యులు వకులాభరణం భాస్కర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బి.ఎన్.రెడ్డి నగర్‌లో జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం రూ.5.50 కోట్లతో అభివృద్ధి

**- కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**





**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి 9)**:జిహెచ్ఎంసి హయత్ నగర్ సర్కిల్ కార్యాలయాన్ని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్‌లో రూ.5.50 కోట్లతో నిర్మించేందుకు నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఈ నిధుల మంజూరుకు సహకరించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఐఏఎస్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.అదేవిధంగా డివిజన్ అభివృద్ధిలో భాగంగా పలు కాలనీల్లో వర్షపు నీటి పైప్‌లైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో రూ 25 లక్షలు, బి.ఎన్.రెడ్డి నగర్ కాలనీలో రూ.21.30 లక్షలతో సీసీ రోడ్లు, అలాగే వర్షపు నీటి పైప్‌లైన్‌కు రూ.53 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, స్థానిక ప్రజలు, సంక్షేమ సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## భారత్ కి షాక్...రష్యాతో పాక్

రెండు కత్తులు ఒక ఒరలో ఇమడవు అని సామెత ఉంది. ఇపుడు అమెరికా ఒక వైపు రష్యా మరో వైపు మధ్యలో భారత్ ఉంది. బ్యాలెన్స్ చేసేందుకు భారత్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కానీ అమెరికా పట్టుదల ముందు భారత్ మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సిద్ధపడాల్సి వచ్చింది. ఆ విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ విషయంలో విజయం సాధించారని అంటున్నారు. అలాగే రష్యాతో భారత్ ఇంధనం కొనుగోళ్ళు లేకుండా కూడా చేస్తున్నారు అని అంటున్నారు. ఈ విషయంలో భారత్ అయితే అధికారికంగా తన స్పందనను ఎక్కడా తెలియచేయలేదు. కానీ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్ళు భారత్ ఆపేస్తే మాత్రం రెండు దేశాల మధ్య గ్యాప్ అయితే కచ్చితంగా పెరిగిపోతుంది అని అంటున్నారు.. భారత్ తో పెట్టుకుంటే అట్లుంటదీ మారుతున్న పరిస్థితులు : భారత్ అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కాదు కానీ రష్యాకి భారత్ దూరం అవుతోందా అన్న చర్చ మొదలైంది. నిజానికి చూస్తే భారత్ రష్యాల మధ్య సంబంధాలకు ఆరున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. ఎప్పటికీ భారత్ కి నమ్మదగిన మిత్రుడిగా రష్యా ఉంది. అదే సమయంలో రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం సమయంలో అంతర్జాతీయ సమాజం రష్యాను ఒంటరిని చేస్తే భారత్ అండగా నిలిచింది. ఇంధన కొనుగోళ్ళ ద్వారా రష్యాకు కొత్త బలం ఇచ్చింది. గత ఏడాది డిసెంబర్ లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా రెండు దేశాధినేతలు తమ దేశాల మధ్య స్నేహం గురించి గొప్పగా చెప్పుకున్నారు. మరి అంతలోనే ఇంత మార్పు అన్నట్లుగా అమెరికా డీల్ వచ్చింది అని అంటున్నారు. ఈ క్రమంలో రష్యా చూపు పాక్ మీద పడింది అని అంటున్నారు. తాజాగా పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ లో లో బాంబు పేలుడు సంభవించి 36 మంది మరణించారు. ఈ ఘటనకు స్పందించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ పాక్ అధ్యక్షుడు జర్దారీకి, అలాగే ప్రధాని షరీఫ్ కి స్వయంగా మేసెజ్ పంపించారు. జరిగిన బాంబు దాడి పట్ల సంతాపం తెలియచేస్తూనే తాము ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాగే పోరులో పాక్ కి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో అంతర్జాతీయంగా కొత్త బంధానికి అవకాశం ఏర్పడుతుందా అన్న చర్చకు తెర లేస్తోంది. ఇక చైనా రష్యాల మైత్రి చెప్పాల్సింది లేదు. చైనా భారత్ కి పక్కలో బల్లెంగా ఉంటూ వస్తోంది. అయితే రష్యా భారత్ కి మిత్రుడు కాబట్టి ఆ ప్రభావం కూడా చైనా మీద ఎంతో కొంత ఉందని అందుకే అంతగా దూకుడు చేసేది ఉండదని అంటారు. ఇక పాక్ చైనా మంచి మిత్రులు అన్నది తెలిసిందే. ఇపుడు ఈ మూడు దేశాలు చేతులు కలిస్తే భారత్ కి ఏమైనా ఇబ్బందులు కొత్తగా వస్తాయా అన్న చర్చ సాగుతోంది. అయితే ఇక్కడ మరో విషయం ఉంది. భారత్ ఏ నాటికీ రష్యా బంధాన్ని వదులుకోదు, అదే సమయంలో రష్యా కూడా భారత్ చెలిమి విషయంలో దూరం పెంచుకోదని అంటున్నారు. ఇదంతా కూడా తొందరలోనే సమసిపోతుందని భారత్ దౌత్య నీతి ఎపుడూ అందరికీ మిత్రుడు అన్న విధానంలోనే ఉంటుందని దౌత్య నిపుణులు అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## అన్నదానం కు 20 వేలు విరాళం.



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 9( వార్త ప్రభ)** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు గుంటూరు జిల్లా గుంటూరు పట్టణ వాస్తవ్యులు గంటా కృష్ణమూర్తి ,ప్రభావతి దంపతులు వారి పిల్లలు ప్రశాంత్, రుద్రాణి పేరు పై శ్రీ అమ్మవారి నిత్య అన్నదాన పథకమునకు 20వేల రూపాయలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు..

## రేపే హుండీల లెక్కింపు



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవ రి 9 ( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు లో వెంచేసివున్నా శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం లో భక్తులచే సమర్పిచిన కానుకల హుండీలను బుధవారం ఉదయం 8 గంటల నుండి లెక్కింపు జరుగు తుంది అన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు ఆలయ ఈ ఓ. బి. మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో పాల్గొనే భక్తులు, గ్రామ ప్రజలు సకాలశీ లోపాల్గొనాలని ఈ.ఓ. విజ్ఞప్తి చేశారు.

## నియోజకవర్గం లో అక్రమ రేషన్ దందా



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 9( వార్త ప్రభ)** జగ్గయ్యపేట నియోజకవర్గం లో మూడు మండలలో ఇద్దరు వ్యక్తులు మండలాల వారీగా పంచుకొని అక్రమంగా రేషన్ బియ్యం రాష్ట్రాలు దాటిస్తున్న పరిస్థితి జగ్గయ్యపేట నియోజకవర్గంలో నెలకొంది. రాష్ట ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన రేషన్ బియ్యం పంపిణీ రాష్టాలు దాటుతున్న అధికారులు పట్టించుకోవటం లేదు అనే విమర్శలు వస్తున్నాయి.మండలాల పరిధిలో ఒక్కరు మండలాల్లో ఒక్కరు పంచుకుని రేషన్ డీలర్ల వద్ద నుంచే నేరుగా రేషన్ బియ్యం వారి వద్దకు వచ్చేలా ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం.ఈ మండలాలో ఉన్న రెవిన్యూ అధికారులకు రేషన్ బియ్యం రాష్టాలు దాటుతున్న విషయం తెలియక పోవడం ఆశ్చర్యం గా ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారస్తుల కారణం గా కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందినీ ప్రజలు భావిస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం జరగకుండా చూస్తారని ప్రజలు భావిస్తున్నారు.

# ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకోవాలి

- భావిభారత పౌరులను సమాజ నిర్మాతలుగా తీర్చిదిద్దండి
- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ తాళ్లపల్లి సాయిసుధీర్




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచవ్యాప్తంగా నేడు కృత్రిమమేధ (ఎఐ), మెషిన్ లాంగ్వేజ్ (ఎంఎల్) వంటివి శాసిస్తున్నాయనీ,నేటి యువతరం ఆయా కోర్సులను తాము ఎంచుకున్న వృత్తికోర్సులకు అనుసంధానించుకుని ముందుకు సాగితేఅత్యుత్తమ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయంరిజి(స్టార్ డాక్టర్ తాళ్లపల్లి సాయిసుధీర్ అన్నారు. విజయవాడ ఒన్ టౌన్ కెబిఎన్ కళాశాల ఆవరణలోని ఎస్ఆర్ఎస్విబిఇడి కళాశాల ఆవరణలో చదివి ‹డిఎస్సీ –2025‹ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన తమ పూర్వవిద్యార్థులకు కాలేజీలోని నన్నయ కళావేదిక (రీడింగ్ రూమ్)లో ఆదివారం అతిథుల చేతులమీదుగా ఘనసత్కారం జరిగింది. సభకు ఎస్ఆర్ఎస్వి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ అండ్ కరస్పాంటెంట్ ఎం. సతీష్ కుమార్అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన రిజి(స్టార్ తాళ్లపల్లి సాయిసుధీర్ మాట్లాడారు. సమాజాన్ని ప్రగతిపథంలో ముందుకు సాగాలంటే యువశక్తి అవసరమనీ, అలాంటి భావిభారత యువశక్తిని తయారుచేసే సత్తాగలిగివారు ఉపాధ్యాయులు, అధ్యాపకులేన్నారు. ‹అన్నదానం ఆకలిని తీరిస్తే.. అక్షరదానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది‹అన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి స్ఫూర్తిని తీసుకుని ఉపాధ్యాయులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు సరికొత్త ఆలోచనలతో బావిభారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దటానికి శక్తివంచన లేకుండాకృషిచేయాలన్నారు. దేశానికి మార్గదర్శకత్వం వహించే నవతరం రూపొందేలా బాధ్యతగా ముందుకు సాగాలన్నారు.ఒక ఊళ్ళో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంటే ఆ గ్రామం స్వరూపం వేరుగా ఉంటుందనీ, ఊళ్ళో విద్యార్థుసందడి కన్పిస్తుందన్నారు. బాల్య వివాహాలు తగ్గుతూ, అక్షరాస్యత శాతం పెరుగుతుందన్నారు. ఎక్కువ మంది ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. పూర్వ విద్యార్థి సంఘాలుబలోపేతం అవుతాయనీ, చదువు పూర్తయినా కూడా పాఠశాలతో వారి అనుబంధం కొనసాగుతుందన్నారు.ఇలాంటి అనుబంధం వల్ల పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు సులభంగా సమకూరుతాయన్నారు.పాఠశాలలో మంచి గ్రౌండ్ ఉంటుందనీ, పిల్లలు చక్కగా ఆడు కోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుఉన్నత పాఠశాలలు బలంగా ఉండాలంటే, ప్రక్క గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు కూడా బలంగా ఉండాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయుల కృషితో పాటు, ప్రభుత్వాల తోడ్పాటు కూడా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్రభుత్వాలు విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంఏటేటా డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయటం ఎంతో శుభపరిణామన్నారు. భావి ఉపాధ్యాయులుఇక్కడ ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మంచి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ రంగంలోస్థిరపడొచ్చునన్నారు. ఎస్ఆర్ఎస్వి బిఇడి కళాశాల ప్రెసిడెంట్ మహంకాళి మోహనరావు మాట్లాడుతూ తవిద్యాసంస్థల ద్వారా పలు దశాబ్దాలుగా విజయవాడ నగరంలో విద్యాసుగంధాలను వెదజల్లుతున్నామన్నారు.

# రోడ్డు బ్లాక్ స్పాట్స్ పై డ్రోన్ల ద్వారా నిరంతర ప్రత్యక్ష నిఘా

**“విజయవాడలో ట్రాఫిక్ సమస్యలకు ఆధునిక పరిష్కారం - డ్రోన్ టెక్నాలజీ వినియోగం”**





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో రోడ్డు ప్రమాదాలు జరిగే 123 బ్లాక్ స్పాట్ లను గుర్తించడం జరిగింది. వీటిపై ట్రాఫిక్ డి.సి.పి. శ్రీమతి షిరీన్ బేగం స్వీయ పర్యవేక్షణలో ఎ.సి.పి.లు, ఇన్స్పెక్టర్లు వారి వారి సిబ్బందితో కలిసి సదరు బ్లాక్ స్పాట్స్ లపై డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది.డ్రోన్ లను ఉపయోగించి బ్లాక్ స్పాట్స్ వద్ద ట్రాఫిక్ ఎలా ఉంది, వాహనాలు ఏ వేగంతో వెళ్తున్నాయి రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తూ తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఏదైనా బ్లాక్ స్పాట్ వద్ద ట్రాఫిక్ జామ్ అయినప్పుడు, డ్రోన్ల ద్వారా సమస్య ఎక్కడ ఉందో గుర్తించి ట్రాఫిక్ ను మళ్లించడానికి తగినంత చర్యలను తీసుకోవడం జరుగుతుంది. ఈ డ్రోన్ లను ఉపయోగించి బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాదం జరిగితే, అంబులెన్స్ లేదా పోలీసులు రావడానికి ముందే డ్రోన్ ద్వారా పరిస్థితిని అంచనా వేసి తక్షణ సహాయం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు చర్యలు తీస్కుకోవడం జరుగుతుంది.ఈ క్రమంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి అనగా నో హెల్మెట్, ట్రిబుల్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, వన్ వే డ్రైవింగ్ మొదలైన ఉల్లంఘనలను డ్రోన్ ల ద్వారా గుర్తించి వారిపై చాలాన్లు విధించడం జరుగుతుంది.ఈ డ్రోన్ నిఘా విధానం ద్వారా ప్రయాణికులకు సురక్షితమైన మరియు సజావుగా సాగు ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

# ఎన్.ఐ.ఆర్.డి లో ఎస్.హెచ్.జి మహిళలకు 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభం

- హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై ప్రారంభమైన శిక్షణ
- ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజులు పాటు శిక్షణా కార్యక్రమం
- హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ లో శిక్షణ తీసుకుంటున్న 40 మంది ఎస్.హెచ్.జి మహిళలు
- శిక్షణ తరగతులను ప్రారంభించిన అసోసియేట్ ప్రొపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె -హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్






**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై ఐదు రోజుల పాటు శిక్షణ పొందేందుకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డికి వెళ్లిన 40 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలకు శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభం అయ్యాయి. 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు వెళ్లిన వీరికి ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజులు పాటు హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం పై శిక్షణ వుంటుంది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.ఈ ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభ సమావేశం ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. లో సోమవారం అసోసియేట్ ప్రొపెసర్ (సి.ఐ.ఎ.టి.ఎస్.జె –హెడ్) డాక్టర్ సి.కత్తిరేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ శక్తివేల్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మ హ్మద్ ఖాన్, సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు శిక్షణ తీసుకునే 40 మంది ఎస్.హెచ్.జి మహిళలకు ముందుగా హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ విధానం శిక్షణ తరగతుల కార్యక్రమాల గురించి, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీ రాజ్ గురించి వివరించారు. మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీ లో శిక్షణ పొందే వారికి మొదటి రోజు శిక్షణలో భాగంగా గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో బేసిక్స్ ఆఫ్ హ్యాండ్ మేడ్ పేపర్ టెక్నాలజీ, కావాల్సిన ముడి పదార్థాలు వాటి లక్షణాలు, తయారీ ప్రక్రియ, ఉపయోగాలు సవివరంగా తెలియజేయటం జరిగింది. అలాగే ఫోటో ఫ్రేమ్ డిజైన్స్, మెటీరియల్ సెలక్షన్ గురించి, ఎల్.పోల్డర్ తయారీ పై, ఫైల్ తయారీ కోసం కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, ఫైల్స్ డిజైన్ ఎలా వుండాలి...హ్యాండ్ ఆన్ పోల్డర్ గురించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం వీటిని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. స్వయం ఉపాధి నెలకొల్పుకునేందుకు శిక్షణ కార్యక్రమంకు పంపించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డికి శిక్షణ పొందుతున్న మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల లో ఆర్థిక అవగాహన పెంపొందించుకోవాలి

**- జిల్లా కలెక్టరు డీకే బాలాజీ.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందిం చుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం నగరంలోని కలెక్టరేట్ విసి హాలులో జిల్లా కలెక్టర్ భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బిఐ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో కీలకమని, సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లు మరియు ఆర్థిక మోసాల నుంచి రక్షణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఎల్డిఎం రవీంద్రారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## రెండో రోజు మొబైల్ మెడికల్ క్యాంప్ కు అనూహ్య స్పందన..





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి )** సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొబైల్ మెడికల్ క్యాంప్ రెండో రోజు కొనసాగింది.. భావనీపురం 42 వ డివిజన్ హెచ్ బీ కాలనీ లో ఆదివారం కూడా క్యాంప్ నిర్వహించారు.. వందల సంఖ్యలో స్థానికులు వచ్చి వివిధ ఆరోగ్య సమస్యల పై వైద్యులను సంప్రదించి వైద్య సాయం అందుకున్నారు.. క్యాంప్ లో భాగంగా పీవీఆర్ హాస్పిటల్స్ సిబ్బంది రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో,పరీక్షలు నిర్వహించారు.. రోగ నిర్ధారణ అయిన వారికి సుజనా ఫౌండేషన్ మందులను సైతం ఉచితంగా అంద చేశారు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు, సుజనా మిత్ర లు పాల్గొన్నారు..

## ఏషియన్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్‌లో ఏపీ క్రీడాకారుల సత్తా

**శాప్ ఛైర్మన్ రవి నాయుడు అభినందనలు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9:(వార్తా ప్రభ ప్రతినిధి)**పంజాబ్ రాష్ట్రం లూథియానాలో ఫిబ్రవరి 3 నుంచి 8 వరకు నిర్వహించిన 2వ ఏషియన్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్--2026లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అద్భుత విజయాలు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీల్లో ఏ.ఎస్.వైశాలి అండర్--15 బాలికల డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, పీ.వి.చిన్మాస్ అండర్--15 బాలుర డబుల్స్ విభాగంలో కాంస్య పతకం, ఎం.రేవంత్ అండర్--18 బాలుర డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రధాన కార్యాలయంలో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ని క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవి నాయుడు క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, వారి ప్రతిభను ప్రశంసించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పడకేసింది... రోగాలు పడగ విప్పుతున్నాయి

**లంకా గోవిందరాజులు ఆగ్రహం**




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలోని 29వ డివిజన్ సమస్యల నిలయంగా మారిందని, డివిజన్ లో పారిశుధ్య నిర్వహణ లోపంతో దోమల ఉధృతితో ప్రజలు నరకయాతన అనుభవిస్తూ, రోగాల బారిన పడుతున్నారని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు లంకా గోవిందరాజులు ధ్వజమెత్తారు.సోమవారం స్థానిక నేతాజీ రోడ్డులోని చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో జమ్ముల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన 29వ డివిజన్ శాఖా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డివిజన్ నిర్మాణ బాద్యులు నగర కార్యవర్గ సభ్యులు లంకా గోవిందరాజులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల మొద్దునిద్రతో స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం వల్ల డివిజన్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యతముగా మారిందని, స్థానిక ప్రజలు చీకటి పడటం ఆలస్యం “దోమల బాబాయ్.. దోమలు!” అంటూ గగ్గోలు పెడుతున్నా, అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరించడం సిగ్గుచేటుఅని మున్సిపల్ యంత్రాంగం తక్షణమే స్పందించి దోమల నివారణకు వెంటనే ఫాగింగ్ చేయాలని, డ్రైనేజీల్లో యాంటీ లార్వా మందు పిచికారీ నిర్వహించి దోమల నిర్మూలన చేపట్టాలని డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. అలాగే డివిజన్ లోని స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త కృషి చేసి డివిజన్ పార్టీ బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భముగా జరిగిన సమావేశంలో డివిజన్ కార్యదర్శిగా యడ్ల మల్లికార్జునరావు (శివ), సహాయ కార్యదర్శులుగా షేక్ సుభాని, గోగ నవీన్ , కోశాధికారిగా సాంబశివరావు కమిటీ సభ్యులుగా కృష్ణ కుమారి, సూర్యకుమారి, షేక్ సాదిక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలియజేసారు. ఫిబ్రవరి 14 తేదీ రాష్ట్రంలో పేట్రేగిపోతున్న మెడికల్ మాఫియాకి వ్యతిరేకంగా రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా జరిగే నిరసన కార్యక్రమంలో డివిజన్ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# కృష్ణమ్మ ఒడిలో కవితా నీరాజనం.. కవులే సమాజానికి మార్గదర్శకులు: మంత్రి కందుల దుర్గేష్

● కృష్ణా తీరం కవితా హారం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ ● బోధిసిరి నౌకలో 51 మంది కవుల కవితా గానం - స్వయంగా వీక్షించిన మంత్రి దుర్గేష్ ● రాష్ట్రవ్యాప్త నది తీరాల్లో ఇలాంటి సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చూడతామని హామీ








**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రకృతి ఒడిలో సాగే సాహిత్య సమ్మేళనాలు సమాజానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ భవానిపురం సమీపంలోని హరిత బెర్మ్ పార్కు వద్ద ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఏపీ పర్యాటక శాఖ, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "కృష్ణా తీరం కవితా హారం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశతో కలిసి 'బోధిసిరి' నౌకలో ప్రయాణిస్తూ, 51 మంది కవులు వినిపించిన కవితలను ఆసక్తిగా ఆలకించారు. కృష్ణమ్మ అలల పైన కదులుతున్న పడవలో కవి సమ్మేళనం జరగడం ఒక కొత్త ఒరవడికి నాంది అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈ తరం కవులు సమర్పించిన కవితా హారతి ఇది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పలు కీలక అంశాలను వెల్లడించారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించి, నంది అవార్డులను అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని గాడిలో పెడుతున్నామని, ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలను ఘనంగా అందజేస్తామన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహ ఏర్పాటుపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించామని, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇదే తరహాలో పెన్నా, గోదావరి నదీ తీరాల్లో సాహిత్య కార్యక్రమాలు చేపడతామని, ముఖ్యంగా దేవీపట్నం నుండి పాపికొండలు వెళ్లే లాంచీలో త్వరలోనే కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. సమకాలీన సమాజంలోని అట్టడుగు వర్గాల ఆవేదనను ప్రతిబింబించేలా సాగిన ఈ కవితలను వీడియో డాక్యుమెంటేషన్ ద్వారా డిజిటలైజ్ చేసి భావితరాలకు అందించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. కవులు, కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల మధ్య ఇలాంటి సాహిత్య వేదికలు తమకు మానసిక శాంతిని, సమాజ సేవకు పునరంకితమయ్యే స్ఫూర్తిని ఇస్తాయని మంత్రి దుర్గేష్ చమత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబై నుంచి వచ్చిన 51 మంది కవులను మంత్రి దుర్గేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సంస్థ ప్రతినిధులు మరియు సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కవులు.. లోకానికి భావభానులు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ** కవులు సమాజానికి వెలుగునిచ్చే భావభానులని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. రచయితలు, వారి రచనలను పరిరక్షించుకోవడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కళలు, సాహిత్యం మన సంస్కృతికి జీవన రేఖలని.. చెట్టు వేర్లు వంటివని.. ఇవి ఎంత బలంగా ఉంటే మన సమాజం అంత బలంగా ఉంటుందని పేర్కొన్నారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక పర్యాటకాన్ని, సంస్కృతిని, కళలు, సంప్రదాయాలను ఎప్పుడూ కాపాడుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి చెబుతుంటారని పేర్కొన్నారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేస్తారని, భావజాల వికాసంలో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. కవులు, రచయితలు, రచనలు లేని సమాజాన్ని ఊహించుకోలేమని.. తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించే వారందరికీ ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని.. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల స్ఫూర్తితో నేడు నిర్వహించిన కృష్ణాతీరం–కవితా హారం కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించిన మల్లెతీగ సాహిత్య సేవా సంస్థకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ ఒక జాతి బతకాలంటే భాష బతకాలి, సమాజం బతకాలంటే సాహిత్యం బతకాలి.. చరిత్ర అనేది రాజుల శాసనాల నుంచి కాదు.. కవుల పద్యాల నుంచి తెలుసుకున్న చరిత్రమనదని పేర్కొన్నారు. నది భూమిని సస్యశ్యామలం చేస్తుంటే, కవులు మనుషుల మనసులను సస్యశ్యామలం చేస్తారని పేర్కొన్నారు. వేమన పద్యాలు, సుమతీ శతకం అందించే జ్ఞానం ప్రపంచమంతా తిరిగినా దొరకదని, సాహిత్యం అనేది తరతరాలకు విజ్ఞాన వారధి అని పేర్కొన్నారు. మనం ఎంత ఆధునికమైన ఏఐ యుగంలో జీవిస్తున్నప్పటికీ మూలాలను మరచిపోకూడదని, భాష––సాహిత్యాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తేజస్వి స్పష్టం చేశారు. కవులు, కళాకారులను రక్షించుకోవడం ద్వారా మాత్రమే సంస్కృతి నిలుస్తుందని.. ఈ విషయంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అహర్నిశలు కృషిచేస్తోందని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందని తేజస్వి పేర్కొన్నారు. సంప్రదాయాలు, విలువలు, కళలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశగారు ప్రోత్సహిస్తున్న తీరు, ఆయన కళాత్మక హృదయం.. జీవనదీ ప్రవాహమని అన్నారు. కొండపల్లి బొమ్మలు, కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తున్న తీరు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కళలు, కళాకారులను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాల్సిన అవసరముందని.. ఈ విషయంలో ప్రభుత్వం ముందుంటోందని ఆమె పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు, ముఖ్యంగా సరికొత్తగా రూపాంతరం చెందిన, చెందుతున్న నేటితరం కవిత్వాన్ని కాలగర్భంలో కలిసి పోకుండా భద్రపరిచి, ముందుతరాలకు అందించేందుకు రికార్డు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమానికి చేయూతనిచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్, కె.సంపత్, వై.డి.ఆనంద్, పి.చిదంబరం, బత్తిన అగస్తీశ్వరరావు, విష్ణుభొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి - జిల్లా కలెక్టరు డికె బాలాజీ



**మచిలీపట్నం ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో బాల్య వివాహాలు నిరోధించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారుసోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ లో బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వారు వాసవ్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ వారు బాల్య వివాహ ముక్తి రధాన్ని ఏర్పాటు చేసారు. ఈ బాల్య వివాహ ముక్తి రధాన్ని జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ డి కె బాలాజీ జండా వూపి వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆలో ఐసిడిఎస్ పిడి ఎం ఎన్ రాణి, డీసీపీవో బి కిషోర్ , వి ఎం ఎం ప్రెసిడెంట్ బి కీర్తి , రామానుజయ్య వి ఎం ఎం పీ డి ఎం. దివ్య , పి హెచ్ సిహెచ్ ఉష ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైజ్‌తో గ్రామీణ మహిళలకు మార్గనిర్దేశం

*- శిక్షణ నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర సహకారం*

*- సత్ఫలితాలిస్తున్న జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ నేతృత్వంలోని కార్యక్రమాలు*



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండలం పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్) గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు మార్గదర్శిగా నిలుస్తోంది. స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయాలనుకునే మహిళలకు సరైన మార్గనిర్దేశంతో పాటు శిక్షణ, మార్కెటింగ్ సహకారం అందిస్తూ వారి ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు రైజ్ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోంది. పేపర్ క్రాఫ్ట్ విభాగంలో వినూత్న ఆలోచనలను అమలు చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్న ప్రాసాదంపాడు గ్రామానికి చెందిన ఎం.వరలక్ష్మి సోమవారం రైజ్ కేంద్రంలో 20 మంది ఔత్సాహిక స్వయం సహాయక సంఘ మహిళలకు శిక్షణ అందించారు. ఒకప్పుడు నెలకు రూ.5 వేల ఆదాయం మాత్రమే ఉండేదని, ప్రస్తుతం నెలకు సుమారు రూ.50 వేల టర్నోవర్ సాధిస్తున్నానని ఆమె వివరించారు. తాను స్వయం ఉపాధితో నిలదొక్కుకోవడమే కాకుండా మరో పది మందికి ఉపాధి కల్పించగల స్థాయికి ఎదిగానన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చి ఇంటి నుంచే ఉపాధి పొందే అవకాశాన్ని కల్పించడమే తన లక్ష్యమని వరలక్ష్మి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గనిర్దేశం వల్లే తన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. మహిళలు కష్టపడటంతో పాటు ఆసక్తి, నిబద్ధతతో ముందుకు వస్తే వ్యాపార రంగంలోనూ తప్పకుండా రాణించవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏ.ఎన్.వి. నాంచారరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగికు ఘన సన్మానం

**ఉద్యోగాన్ని ఇష్టంగా చేసిన వ్యక్తి వెంకటేశ్వరరావు..... ఏపీ ఎంపీఎ రాష్ట్ర నాయకులు వీర్ల శ్రీరామ్ యాదవ్.**



**మచిలీపట్నం ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం లో డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తు ఇటీవల రిటైర్డ్ అయ్యిన వెంకటేశ్వర రావు ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ సోమవారం సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ డ్రైవర్ గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరావు ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తి అన్నారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి విశ్వసనీయతతో, బాధ్యతాయుతంగా నిర్వహించారని, కష్ట సమయాల్లో కూడా ఉద్యోగ బాధ్యతలను ఇష్టపడి చేశారని ఆయన సేవలను కొనియాడారు. దాదాపు 31 ఏళ్ల పాటు అంకితభావంతో తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం గొప్ప విశేషమని, ఆయన నిబద్ధత, సేవా దృక్పథం ఇతరులకు స్ఫూర్తిదాయకం అన్నారు. వెంకటేశ్వరరావు శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని అభిలాషించారు. ఆయనతో ఉన్న స్నేహాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కృష్ణా జిల్లా మీడియా అక్రిడిషన్ కమిటీ సభ్యులు మన్నే సోమేశ్వరరావు ,మత్తి శ్రీకాంత్ , జీ. శ్యామ్ బాబు , ఏపీ ఎంపీఏ నాయకులు రాజు , బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

**సిఐటియు మండల కార్యదర్శి ధారా నాగేశ్వరరావు**



**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 9( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామంలో సోమవారం లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆటో, ముఠా, హాకర్లకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, భవనిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు కొనసాగిస్తూ జీవో జారీ చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు పెనుగంచిప్రోలు మండలం కార్యదర్శి దారా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా సోమవారం పెనుగంచిప్రోల్లోని ఆటో స్టాండ్ వద్ద సమ్మె పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు భారతదేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధంగా లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని నాగేశ్వర రావు అన్నారు. కార్మికులకు సంఘం, పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కు ,జీతాలు, కూలి పెంచమని కొట్లాడేటువంటి హక్కు లేకుండా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ మార్చారని అన్నారు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులు కొనసాగించాలని కోరారు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు కేరళ ప్రభుత్వం వలె ఏర్పాటు చేయాలని, అధిక పెనాల్టీలు వేసే జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, మహిళలకు ఫ్రీ బస్సు నేపధ్యంలో ఆటో కార్మికుల ఆదుకోవాలని కోరుతూ ఈ సమ్మె జరగబో తుందన్నారు సమ్మె సందర్భంగా అన్ని పట్టణ మండల కేంద్రాల్లో జరిగే ర్యాలీలో సకల శ్రామికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక నాయకులు తురక కొండలు,కౌలు రైతులసంఘం నాయకులు వీ.గురవయ్య సిఐటియు మరియు ఆటో యూనియన్ నాయకులు హనుమంతరావు మహేష్ , మరియు సిఐటియు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## 12వ వేతన సవరణ కమిషన్ ను నియమించాలి.

● ఛైర్మన్ గా విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలి ● కమీషన్ గడువు మూడు నెలల వ్యవధిగా ఉండాలి ● 29% మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించి అమలు చేయాలి.● నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**12వ వేతన సవరణ కమీషన్ ను నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కరణం హరికృష్ణ మాగంటి శ్రీనివాసరావు లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు . జూలై 1 2023 నుండి పి ఆర్ సి అమలు కావలసి ఉన్నా రెండున్నర సంవత్సరం ఇప్పటికే గడిచిపోయిందని వివరించారు. కావున వెంటనే వేతన సవరణ కమిటీని నియమించాలని కోరారు. ఛైర్మన్ గా విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని విన్నవించారు. ఇప్పటికే ఆలస్యమైనందున కమిషన్ గడువు మూడు నెలల వ్యవధిగా ఉండేలా చూడాలన్నారు. గతంలో సాంకేతికత లభ్యం లేకపోవడంతో నెలకు ఒక కుటుంబం యొక్క ఖర్చు పెరిగిన ధరల సూచికతో పోల్చడానికి అధిక సమయం, కాలం తీసుకునేదని విశ్లేషించారు. ప్రస్తుతం ఆధునిక సాంకేతిక అందుబాటులో ఉండడం వల్ల, సమాచారమంతా అంతర్జాలంలో లభ్యమవుతోందని కావున ఆ సమయం 15 రోజులకే సరిపోతుందని తెలిపారు. పి ఆర్ సి కమిషన్ రిపోర్టును మూడు నెలల లోపు తెప్పించుకొని 40 శాతం పైగా ఫిట్మెంట్ను ఇచ్చి పిఆర్సి అమలు చేయాలని కోరారు. అంతవరకు 29% మధ్యంతరభృతిని వెంటనే ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఐ ఎఫ్ టీ యు గోడపత్రిక ఆవిష్కరణ



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):**లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త కార్మిక సంఘాలు చేస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఇబ్రహీంపట్నం మండల బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కార్మికులు ఐఎఫ్టియు ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కొప్పుల కుమార్ మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు. సంక్షేమ బోర్డు అమల విషయంలో రాష్ట్ర ప్రభుత్వము వైఖరి మార్చుకోవాలని, సంక్షేమ బోర్డును తక్షణమే అమలు చేయాలని, అదేవిధంగా ఏడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న క్లైములు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు 10 లక్షలు తక్షణమే ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, మహిళా కార్మికులకు కాన్పుకు 50 వేల రూపాయలు చొప్పున రెండు కాన్పులకు లక్ష రూపాయలు ఇవ్వాలని, సహజ మరణానికి రెండు లక్షల ఇవ్వాలని 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులను పెన్షన్ 5000 రూపాయలు ఇవ్వాలని భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లలకు పెళ్లి కానుక లక్ష రూపాయలు ఇవ్వాలని కోరారు. సంక్షేమ బోర్డు నుండి కార్మికుడికి ఇచ్చిన కార్డు భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల గౌరవ అధ్యక్షులు కోనేరు ఆంజనేయులు కృష్ణమాచారి,అధ్యక్షులు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి సాంబశివరావు,ఉపాధ్యక్షులు అనంత చారి,శివమణి. ఎస్ కే భాష తదితర బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## గుళ్లపల్లి లో ఈ నెల 15 న మహాశివరాత్రి ఉత్సవాలు



**చెరుకుపల్లి మండలం ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగంబిక సమేత శ్రీ ఆనందీశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 15వ తేదీ మహాశివరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతాయని దేవస్థానం శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ సోమవారం తెలియపరిచారు . దేవస్థాన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీ ఆనందీశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రవారాభిషేకం పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం జరుగుతాయన్నారు. తదనంతరం తీర్థప్రసాదాలు వినియోగం జరుగుతుందని ధర్మకర్త తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చేజర్ల లో రెండవ రోజు ఆర్థిక బకాయిల కొరకు యుటిఎఫ్ పోస్ట్ కార్డ్ క్యాంపైన్



**చేజర్ల ఫిబ్రవరి 09 (వార్తాప్రభ)** ఆదూరుపల్లి క్లస్టర్ ప్రాంతంలోని పాఠశాలల్లో యు టి ఎఫ్ నాయకులు పి.ఆర్.సి ఛైర్మన్ ను నియమించుట ఆర్థిక బకాయిలు విడుదల ఐఆర్ 20 శాతం ఇచ్చుట సి పి ఎస్ రద్దు మెడికల్ బిల్లుల ఆలస్యం మొదలైన డిమాండ్ల సాధన కొరకు సోమవారం పోస్ట్ కార్డ్ క్యాంపైన్ ను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాగినేని రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో 2014 సంవత్సరంలో అత్యధికంగా 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు దే కాబట్టి 12 వ పిఆర్సి లో కూడా మంచి ఫిట్మెంట్ ఇవ్వాలని అప్పటివరకు ఐ ఆర్ 29 శాతం ప్రకటించాలని డి ఏ అరియర్స్ చెల్లించాలని కోరారు. చేజర్ల మండల శాఖ అధ్యక్షులు నేలటూరు బుజ్జయ్య మాట్లాడుతూ 2004 సంవత్సరం తర్వాత చేరిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల యు టి ఎఫ్ ఆడిటర్ పతంగి చిట్టిబాబు యు టి ఎఫ్ సీనియర్ నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు చీర్ల మస్తాన్ బాబు ఖాదర్ భాషా ఉప్పు శ్రీరాములు ఆర్ వి శేషమ్మ గీత మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంస్థల్లో అధిక వేతనాలు

**- కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ**




**మచిలీపట్నం ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బ్యాంకింగ్, బీమా లాంటి ఆర్థిక సంస్థల్లో అధిక వేతనాలు లభిస్తాయని, విద్యార్థులు ఆ దిశగా ఆలోచన చేయాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ సూచించారు. సోమవారం విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యములో బజాజ్ ఫిన్సర్వ్ వారిచే బ్యాంకింగ్, బీమా సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశం కు యువత పెద్ద సంపద అని, వారిలో నైపుణ్యం జోడిస్తే ప్రపంచం లో ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత కింద గతంలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇచ్చేవని, ఇప్పుడు యువతలో నైపుణ్యం పెంచడానికి నిధులు వెచ్చించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. రెక్టర్ ఆచార్య ఎంవి. బసవేశ్వరరావు మాట్లాడుతూ 2009 సంవత్సరం నుండే కృష్ణా విశ్వవిద్యాలయం లో నైపుణ్యం పెంచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ లో ఇతర విభాగాల విద్యార్థులను కూడా భాగస్వాములను చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మేనేజ్మెంట్ విభాగం అధిపతి డా ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బజాజ్ ఫిన్సర్వ్ ప్రతినిధులు రాజశేఖర్, పవన్ కుమార్ లు సర్టిఫికెట్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో మేనేజ్మెంట్ విభాగం సహ ఆచార్యులు డా. పద్మజ, సహాయ ఆచార్యులు డా. భువనేశ్వరి, డా. జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దంతాలను ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక నిమ్రా దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జూపూడి గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పోర్టబుల్ డెంటల్ చైర్ ఉపయోగించి దంత వైద్య నిపుణులు దంత పరీక్షలు నిర్వహించారు. దంత సమస్యలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దంతాల ఆరోగ్యం పై శ్రద్ధ చూడాలని సూచించారు. సాధారణంగా ఎదుర్కొనే దంత సమస్యలను ఇంట్లోనే సరి చేసుకోవచ్చని, రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని, స్వీట్లు, కూల్ డ్రింకులు దంత క్షయానికి కారణమని తెలిపారు. దంతాలు బలంగా ఉండేందుకు కాల్షియం సమృద్ధిగా ఉండే పాల పదార్థాలు, గుడ్లు, కూరగాయలు, పండ్లు, గింజలు వంటి ఆహారం తీసుకోవాలని వైద్యులు వారికి వివరించారు. ఈ వైద్య నిమ్రా దంత వైద్యశాల నిపుణులు డాక్టర్ రామానంద్, డాక్టర్ బెనెఫ్షా, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రగతి ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయం



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):** చిన్నారుల కోసం ప్రజా ప్రగతి ట్రస్ట్ నిర్వాహకులు పనిచేయడం అభినందనీయమని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నం భీమరాజు గుట్ట సామాజిక భవనంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో (ఐఎల్ పీ) ఇండియా లీటర్సీ ప్రాజెక్టు సహకారంతో అంగన్ వాడీ టీచర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. శిక్షణ పొందిన టీచర్లు చిన్నారులతో ప్రాక్టికల్ గా ఆక్టివిటీస్ చేయించాలని సూచించారు. కో – ఆర్డినేటర్ చెంచు రామిరెడ్డి వాతావరణం, క్యాలెండర్, ఐడీ కార్డ్స్, ప్రీ స్కూల్ పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వి.దేవకుమారి, సీడీపీవో కె.పుష్పలత, సూపర్ వైజర్ కె.మాధవి, ఫీల్డ్ కో – ఆర్డినేటర్ టి.శివకుమారి, కె.వెంకటేశ్వర్లు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## వలీమా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ



**ముదినేపల్లి ఫిబ్రవరి 9 (వార్తా ప్రభ)** రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి, ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ) రామిశెట్టి సత్యనారాయణ ముదినేపల్లిలో జరిగిన వలీమా కార్యక్రమంలో పాల్గొన్నారు.ముదినేపల్లి చెందిన షేక్ షాజహాన్ ఆహ్వానం మేరకు ఆయన వారి కనిష్ట పుత్రుడు షేక్ జవాద్ వలీమా కార్యక్రమానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో––ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాబక్షు, సీనియర్ నాయకుడు బేతపూడి వెంకటరమణ, కలిదిండి మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, అల్లాడి సతీష్, రాచురి గణేష్ కుమార్, సిద్ధిక్, ఇర్ఫాన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మమతల పందిరి సేవలు శ్లాఘనీయం: చలమలశెట్టి రమేష్ బాబు





**హనుమాన్ జంక్షన్,పిబ్రవరి 9(వార్తాప్రభ)**మమతల పందిరి సేవలు శ్లాఘనీయం అని గన్నవరం నియోజక వర్గ జన సేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు అన్నారు. మమతల పందిరి సేవా సమితి ఆద్వర్యం లో గత 2 సంవత్సరాలుగా 173 మందికి కుట్టు మరియు జూట్ బ్యాగుల శిక్షణ కార్యక్రమాల వీరవల్లి గ్రామం లో విజయవంతముగా నిర్వహణ అనంతరం దంటగుంట్ల గ్రామంలో సోమవారం నూతనంగా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మమతల పందిరి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు లంక రమేష్ మాట్లాడుతూ మహిళా స్వావలంబనకై విజయవంతముగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాలని నిర్వహించే క్రమంలో దంటగుంట్ల గ్రామ సర్పంచ్ యజ్జవరపు రంగారావు, తెలుగు దేశం పార్టీ మండల ప్రెసిడెంట్ దయాల రాజేశ్వరరావు, కాకులపాడు డీ సి చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ల చొరవతో దంటగుంట్ల గ్రామంలో ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.మమతల పందిరి కోఆర్డినేటర్ కరకట్ల రాధికా నాయుడు మాట్లాడుతూ మమతల పందిరి అద్వర్యం లో వచ్చే జూన్ 25 న ఉదయం 10.44 లకు వీరవల్లి గ్రామం లో రాజా రామ్మోహనరావు మరియు బేబీ సరోజినీ దేవి దంపతుల వితరణ సహాయం తో మమతల పందిరి వృద్ధాశ్రమం భూమి పూజ జరగనున్నదని, ఈ వృద్ధాశ్రమం నిర్వహణ మమతల పందిరి సేవ మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లగలదని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్,ఆశాజ్యోతి మానసిక వికలాంగుల కేంద్రం చైర్మన్ మరీదు మాధవీలత, వడ్డి వాసవీ దేవి,సుంకర సాంబశివ రాయల్ ,వడ్డీల్ల లక్ష్మి కుమారి,యాజ్జవరపు శ్రీనివాస్, బంగారమ్మ తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

# కొల్లేరు రోడ్డు సమస్యకు సొంత నిధులతో పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కామినేని

*సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు విద్యార్థినీ విద్యార్థులు*
*దగ్గరుండి పనులు నిర్వహించిన కొల్లి వరప్రసాద్ (బాబి), బలే యేసురాజు*
*ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డుకు తారు వేయాలని కోరుకుంటున్న కొల్లేరు ప్రజలు.*





**కైకలూరు ఫిబ్రవరి 9 (వార్తా ప్రభ)** కైకలూరు నియోజకవర్గంలో కొల్లేరు రోడ్డు సమస్యకు స్వయంసేవతో పరిష్కారం చూపిన ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్,కైకలూరు నియోజకవర్గం, కొల్లేరు ప్రాంతంలో సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తున్న రోడ్డు సమస్యకు మాటలతో కాదు,సొంత నిధులతో పనులు చేసి చూపించిన నేతగా ఎమ్మెల్యే డా. కామినేని శ్రీనివాస్ మరోసారి ప్రజల మనసులు గెలుచుకున్నారు. ప్రభుత్వ నిధులు రావాలని చూడకుండా, నిధులు లేవు అనే మాట అనకుండా,ఫైళ్లు ముందుకెళ్లాలి టైం గడపకుండా, కైకలూరు పెద్దాయన కామినేని శ్రీనివాస్ "ప్రజలకు అవసరం అయితే నా డబ్బుతో అయినా రోడ్డు వేయాలి" అనే దృఢ సంకల్పంతో ముందుకు వచ్చి కొల్లేరు పెద్దింట్లమ్మ గుడికి వెళ్లే రోడ్ నిర్మాణాన్ని స్వయంగా చేపట్టడం నియోజకవర్గ రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది.ఈ రోడ్ నిర్మాణం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులకు తక్షణ ఉపశమనం కలిగింది.రోడ్డు వేసిన వెంటనే గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.అయితే ఈ రోడ్డుకు తారు వేయడం అత్యవసరమని, ఇది శాశ్వత పరిష్కారంగా మారాలంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించి తారు రోడ్డు వేయాలని కొల్లేరు ప్రాంత ప్రజలు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తున్నారు.డా. కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు,48 గంటల పాటు నిరంతరంగా దగ్గరుండి పనులు పర్యవేక్షించి పూర్తి చేయించిన నాయకులుగాకైకలూరు జనసేన పార్టీ నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబీ)మరియు టీడీపీ కో-కన్వీనర్ బలే యేసురాజు విశేషంగా శ్రమించారు.రాత్రింబవళ్లు తేడా లేకుండా పని జరిగేలా దగ్గరుండి పర్యవేక్షించిన ఈ నాయకుల కృషిని స్థానికులు ప్రశంసిస్తున్నారు.ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, అధికారిక పరిమితులను దాటుకుని అయినా పని చేసి చూపిన నాయకుడు డా. కామినేని శ్రీనివాస్ ఇదే నిజమైన ప్రజాప్రతినిధి అంటే అని కొల్లేరు ప్రజలు గర్వంగా చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం తారు వేయడానికి వెంటనే నిధులు సమకూర్చాలని కొల్లేరు ప్రజలందరూ ఏకగ్రీవంగా ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

# వైభవోపేతంగా డోకిపర్రు మహాక్షేత్రంలో సరస్వతి యాగం...

**- పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థినీ విద్యార్థులు**
**- విద్యలో రాణించాలని ఆశీర్వదించిన వేద పండితులు**



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సరస్వతి యాగం వైభవంగా జరిగింది. ఏటా ఫిబ్రవరి నెల రెండో ఆదివారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీవీ కష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో ఈ యాగం జరుగుతోంది. డోకిపర్రు పరిసర ప్రాంతాల్లోని విద్యార్థినీ విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి కటాక్షం పొందాలని, వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, విద్యాభ్యాసం, వాక్చాతుర్యం, బుద్ధి వికాసం, కళలలో ప్రతిభ మెరుగుదల కోరుకుంటూ ఈ యాగం నిర్వహించారు. సరస్వతి దేవిని విద్య, జ్ఞానం, కళలు, వాగ్దేవి రూపంలో ఆరాధిస్తారు. ఆమె అనుగ్రహం కోరుతూ వేద మంత్రాలు, హోమాలు, పూజా విధానాలతో సరస్వతి యాగం డోకిపర్రు మహాక్షేత్రంలో నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభమైన యాగం పుణ్యాహవచనం, కలశస్థాపన, సరస్వతి ఆవాహన, సరస్వతి అష్టోత్తర శతనామ పూజ, సరస్వతి గాయత్రి జపం అనంతరం పూర్ణాహుతితో ముగిసింది. సరస్వతి యాగంలో పాల్గొని... అందులో భాగస్వాములు అయిన విద్యార్థులకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, పరీక్షలలో విజయం కలుగుతాయని వేద పండితులు వివరించారు. సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం వంటి కళలలో ప్రతిభ, వాక్చాతుర్యం, ఉపన్యాస నైపుణ్యం, రచనా సామర్థ్యం, మనస్సుకు ప్రశాంతత, సాత్విక గుణాల వికాసం మెరుగుదలకు సరస్వతి యాగం ఉపకరిస్తుందని వేద పండితులు వివరించారు. సరస్వతి యాగం కేవలం ఒక క్రతువు మాత్రమే కాదు అది జ్ఞానానికి, విద్యకు, సంస్కృతికి ఇచ్చే గౌరవ సూచకమన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సరస్వతి యాగం జీవితంలో విజ్ఞాన వెలుగులు నింపుతుందని మహాక్షేత్రం ప్రధాన పూజారి శ్రీధర్ తెలిపారు. సరస్వతి యాగంలో భాగస్వాములు అయిన విద్యార్థినీ విద్యార్థులను ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ నేతత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని వేద పండితులు ఆశీర్వదించారు.

## కనులపండువగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...



**గుడ్లవల్లేరు ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి):**భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## మేరీ మాత ఉత్సవాలలో ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణ అందిస్తున్నాం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో జరిగే గుణదల మేరీ మాత ఉత్సవాలలో పాల్గొనే ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణ లో లోపం లేకుండా చూసుకుంటున్నామని, భక్తులకు కొరకు 2000 లీటర్ల కెపాసిటీ గల ఐదు స్టీల్ ట్యాంకర్లలో త్రాగునీరు మరియు 50వేల వాటర్ బాటిల్స్, 440 పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య నిర్వహణ, 2 ప్రదేశాలలో 20 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని అన్నారు. ఉత్సవాలకు వచ్చే మేరీ మత భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే త్రాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అంతరాయం లేకుండా , అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిత్యం పర్యవేక్షిస్తూ ఉన్నారని, నీటి టాంకర్లను రోడ్లతో తడుపుతూ కాలుష్యాన్ని తగ్గిస్తున్నామని, నీటి పరీక్షలు నిర్వహించి శుద్ధమైన తాగునీరని అందిస్తున్నామని, ప్రజలకు నిరంతరం ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్నామని కమిషనర్ అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ముదినేపల్లిలో బీజేపీ గ్రామాల పర్యటన కార్యక్రమం.



**ముదినేపల్లి ఫిబ్రవరి 9 (వార్తా ప్రభ)**రాష్ట్ర పార్టీ సూచనల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముదినేపల్లి మండల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల పర్యటన కార్యక్రమం ప్రారంభమైంది.కైకలూరు ఎమ్మెల్యే సూచనలతో, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటనతో పాటు పోలింగ్ బూత్‌లు, శక్తి కేంద్రాల పునరుద్ధరణ మరియు పరిశీలన కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గురజ గ్రామంలో 65, 66, 67, 68 పోలింగ్ బూత్‌ల అధ్యక్షులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయా బూత్‌లకు శక్తి కేంద్ర ఇన్‌చార్జిగా కురుచేటి శ్రీనివాస్‌ను నియమించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, అందరూ వాటిని ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.అలాగే గ్రామ సమస్యలను సమిష్టిగా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలని,పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త ప్రజల్లో ఎప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గురజ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు వత్తుమిల్లి ప్రసాద్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా గుడివాడలోని రితికా ఫౌండేషన్ నంది అవార్డుతో సత్కరించడాన్ని వక్తలు ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు శక్తి కేంద్ర ఇన్‌చార్జీలుగా నియమితులైన వారికి చిరు సత్కారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులతో పాటు భారతీయ జనతా పార్టీ నాయకులు పసుపులేటి నరసింహారావు,కొల్లిపర నాగరాజు, వత్తుమిల్లి ప్రసాద్, చిట్టూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## "ఆమనగల్‌లో హోరెత్తిన కాంగ్రెస్ ప్రచారం".



**ఎల్బీనగర్/ వార్తప్రభ (ఫిబ్రవరి9)** :మున్సిపల్ ఎన్నికల వేళ ఆమనగల్‌లో కాంగ్రెస్ శ్రేణులు జోరు పెంచాయి. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 15 వార్డుల అభ్యర్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పనిచేస్తుందని, 'చేయి' గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,మహిళ లీడర్లు ,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**పి.ఆర్.టి.యు ఆవిర్భావ దినోత్సవం లో ప్రభుత్వానికి విజ్ఞప్తి**




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని కేతనకొండ అమ్మానాన్న అనాథ వృద్ధాశ్రమంలో పి.ఆర్.టి.యు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం కేక్ కట్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పి.ఆర్.టి.యు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్ జానీ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 1971లో స్థాపితమైన పి.ఆర్.టి.యు అనేక ఉద్యమాల ద్వారా ఎన్నో కీలక ఉపాధ్యాయ సమస్యలను సాధించి అగ్రగామి సంస్థగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిందని అన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులపై జరుగుతున్న వివక్షలను ఎదుర్కొని ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానమైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ ఏర్పడిందన్నారు.ఫిబ్రవరి 9, 1971న ఆవిర్భవించిన పి.ఆర్.టి.యు ద్వారా 010 పద్దతి ద్వారా జీతాలు, ఉన్నత పాఠశాల హెచ్ఎంలకు గెజిటెడ్ హోదా, మహిళా ఉపాధ్యాయులకు 5 ప్రత్యేక క్యాజువల్ లీవులు, కారుణ్య నియామకాలు, అప్రెంటిస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు, సీపీఎస్ ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ వంటి అనేక సౌకర్యాలు సాధించగలిగిందని వివరించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సోల రాఘవ, మండల శాఖ అధ్యక్షుడు తాతినేని నాగబాబు, ప్రధాన కార్యదర్శి బాజాని, సీనియర్ నాయకులు బీవీ రాజమోహన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మద్రి ప్రభాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ ఇర్ఫాన్ , తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం

**పోలీసుల డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీ**





**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):** విద్యార్థులు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్ సూచించారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీ ఆదివారం 13వ రోజుకు చేరింది. గొల్లపూడి దత్త కల్యాణ మండపం నుంచి ప ప్రారంభమైన ర్యాలీ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటుపల్లి రమేష్ నగర్ వద్ద ప్రవేశించింది. ఎస్సీ కాలనీ, ఖాజీపేట మీదుగా ఎస్సార్ కళాశాల వరకు సాగింది. ర్యాలీకి సాంస్కృతిక కళాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో అభివృద్ధిలికి రావాలని ఆకాంక్షించారు. చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రులు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ పై దండయాత్ర కేవలం కార్యక్రమం కాదని, భవిష్యత్ కోసం జరుగుతున్న యుద్ధం అన్నారు. ఇది యాత్ర కాదని, యువత భవిష్యత్తును కాపాడే సంకల్పం అన్నారు. డ్రగ్స్ పై ఎలాంటి సమాచారమైనా 112కు కానీ, 1972కు కానీ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి. రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ ఎన్.వి.దుర్గారావు, ఇబ్రహీంపట్నం సీఐ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు - చైర్మన్ చిట్టిబాబు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమీపించడం తో స్టడీ అవర్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కొండపల్లి పురపాలక చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు సోమవారం నాడు స్టడీ అవర్స్ పరిశీలించారు.ఈ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిఒక్కరూ ఉత్తీర్ణతే లక్ష్యంగా స్టడీ అవర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.శ్రద్ధగా చదివితే వందకు వందశాతం ఫలితాలను సాధించవచ్చని అన్నారు.మంచి ఫలితాలను సాధించి తల్లితండ్రులకి, ఉపాధ్యాయులు పేరు తీసుకురావాలని కోరారు.ఈ స్టడీ అవర్స్ సమయంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యే వరకు తన సొంత నిధులతో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ చిట్టిబాబు తెలిపారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి పురపాలక కమిషనర్ వెంకటరత్నం,ఏఈ మౌస్మీ గనియా, టిడిపి నాయకులు వల్లూరి జనార్ధన స్వామి దాసు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి వృథాపై కఠిన చర్యలు

## -కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ హెచ్చరిక



**కాకినాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలు త్రాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ పిలుపునిచ్చారు. త్రాగునీటిని నిర్లక్ష్యంగా వృథా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఉదయం నగరంలోని 6, 7 డివిజన్లలో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కూటమి నాయకులను కలుసుకుని డివిజన్లలోని పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు, ప్రధాన డ్రైనేజీ ఎత్తు పెంపు, వీధి కుక్కల బెడద, ప్రధాన చర్చ్ పక్కనే ఉన్న చెత్త సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పర్యటన సందర్భంగా ఒక మహిళ త్రాగునీటి కుళాయికి ట్యూబ్‌ను కట్టి ఇంటిముందు ఉన్న రోడ్లను శుభ్రం చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రాగునీటిని ఈ విధంగా వృథా చేయడం అసహ్యకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఇంటికి రెండు రోజుల పాటు త్రాగునీటి సరఫరాను నిలిపివేయాలని సూచించారు. అదేవిధంగా కాకినాడ స్మార్ట్ సిటీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని కమిషనర్ తెలిపారు. ఇటీవల నగరంలో వీధి కుక్కల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నామని, నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించాలనే లక్ష్యంతో డివిజన్ స్థాయిలో పర్యటనలు నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. స్థానికంగా ఉన్న పార్కును పిపిపి విధానంలో అభివృద్ధి చేస్తామని, స్థానికంగా ఉన్న పారిశ్రామికవేతలతో చర్చలు జరుపుతామన్నారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, వాటర్ వర్క్స్ డీ.ఈ లక్ష్మీనారాయణ, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ రామ్మోహన్, ఈఈ ఫణీంద్ర, కూటమి నాయకులు అంబటి చిన్న, దొర్ల చిట్టిబాబు, బొబ్బరాడ ప్రసాద్, కుంచె మధుసూదన్ రావు, కన్నీడి వరప్రసాద్, దొండపాటి లోవరాజు, పచ్చిపాల శ్రీను, సంతోష్, ధర్నా తదితరులు పాల్గొన్నారు.

# తన సొంత ఖర్చుతో రోడ్డు వేయించి స్థానికుల అభిమానం చూరగొన్న బూరగడ్డ..

## -గత 20 సంవత్సరాలుగా ఉన్న అపరిష్కృత సమస్యకు పరిష్కారం..

**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** సోమవారం ఉదయం 29వ వార్డు, బేతవోలు, నిమ్మతోటలో స్థానిక మహిళలు అక్కడ రోడ్డులు లేవని చాలా ఇబ్బందులు పడుతున్నామని గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ కి తెలియచేయగా.. తన సొంత ఖర్చు తో తాత్కాలికంగా చక్కాముక్క వేయించి వారి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో అక్కడ శాశ్వత పరిష్కారంగా వారికి సిసి రోడ్లు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. స్థానికులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోని పరిస్థితుల్లో జనసేన శ్రీకాంత్ కి చెప్పటం మా సమస్యను తాత్కాలికగా పరిష్కరించినందుకు సంతోషం తెలియచేసారు. అలాగే ఎమ్మెల్యే రాముతో చెప్పి త్వరగా రోడ్లు వేయించాలని కోరుతూ బూరగడ్డ శ్రీకాంత్ కి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక 29వ వార్డు టిడిపి నాయకులు ఎస్. తిరుపతి, చీకటి



సూర్యనారాయణ, మొక్కపాటి సూర్యం, శ్రీను, జనసేన నాయకులు కంచనపల్లి సీతారాం, బుడమరాజు, శేషం మురళీకృష్ణ, సాయి పవన్, వెంకటేష్ మరియు స్థానికులు రాజులపాటి ఫణి, కుమారి, సత్యవతి, నాగేశ్వరరావు, కృష్ణవేణి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ సోదరుల అభ్యున్నతికి అబూ కృషి అభినందనీయం

● వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాసిం (అబూ)కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి.. సత్కరించిన మైనార్టీ నేతలు..



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాసిం (అబూ) పుట్టినరోజు సందర్భంగా జిల్లాలోని మైనార్టీ నేతలు, వైసిపి మైనార్టీ సెల్ నాయకులు, మాజీ మంత్రి పేర్ని నాని, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, గజమాలతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో మైనారిటీల సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తూ మైనార్టీ సోదరులకు అభ్యున్నతికి అబూ ఎంతో చేస్తున్నారని జిల్లా మైనార్టీ పెద్దలు అభినందించారు. ఒకవైపు మైనార్టీల సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు వైసీపీ పక్షాన పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రజా ఉద్యమాల్లో అనేక పోరాటాలు చేస్తున్నారని వైసిపి మైనార్టీ సెల్ నేతలు కొనియాడారు. మాజీ మంత్రి కొడాలి నాని, దుక్కిపాటి శశి భూషణ్ ఆధ్వర్యంలో, మాజీ సీఎం జగన్ నాయకత్వంలో ప్రజల పక్షాన జరిగే పోరాటాల్లో, మరియు మైనార్టీల అభ్యున్నతికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా అబూ అన్నారు. మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ దాదా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అచ్చుబ్బ, పెనమలూరు మైనార్టీ నాయకులు అబ్దుల్ అష్రఫ్, అన్వర్, ఉయ్యూరు నాయకులు ఖలీల్ భాయ్, రసూల్, మోషన్ బేగ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు షేక్ బాజీ, గుడివాడ నియోజవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షమ్ము, ధనియాల పేట భాష, బాబులు, జీవస్టీ భాష, సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్, మైనార్టీ నాయకులు భారీ, యాకూబ్, ఫజల్, రహిమా, తదితర నాయకులు అబుకు శుభాకాంక్షలు చెప్పి సత్కరించారు.

## జాబ్ కార్డుతో సంబంధం లేకుండా పని కల్పించాలి - సిపిఐ డిమాండ్



**రాజాం,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** జాబ్ కార్డుతో సంబంధం లేకుండా పని కల్పించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంటేశ్వర్ యాదవ్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏ పి ఎం వినతిపత్రం అందజేశారు .ఉపాధి హామీ పథకం గతంలో పని ప్రదేశంలో ఉన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించాలని సంవత్సరాని కి 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకు 800 రూపాయలు వేతనం ఇవ్వాలని ప్రధానంగా మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చేసి కేంద్ర ప్రభుత్వం వి బి జి రామ్ జి అను కొత్త పేరు పెట్టి గతంలో ఉన్న 100 రోజులు కు అదనంగా 25 రోజులు పెంచినట్లుగా ఆర్భాటంగా ప్రచారం చేయటం దుర్మార్గమని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు కనుక పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ పేరుతో ఉపాధి పని ఉండాలని భవిష్యత్తులో వ్యవసాయ కార్మికులకు ఎటువంటి నష్టం కష్టం ప్రాణహాని జరిగినట్లయితే 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సింగారపు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కవి గద్వాల సోమన్న "పూలవాన" పుస్తకావిష్కరణ



**గుంటూరు, ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న పూలవాన పుస్తకావిష్కరణతో పాటు మమతల కోవెల, గిజిగాని గూడు, పాలపిట్ట పుస్తకాల పరిచయ సభ గుంటూరులో ఘనంగా జరిగింది. పద్మావతి వేదిక, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, బృందవన్ గార్డెన్స్, గుంటూరులో పాలపిట్ట-అమరావతి సాహితీ అధ్యక్షులు డా. రావి రంగారావు,గిజిగాని గూడు -ప్రముఖ నేత్ర వైద్యులు డా. ఆలా సాంబశివారావు, మమతల కోవెల-విమల సాహితీ సమితి అధ్యక్షులు డా. జెల్ది విద్యాధరరావు, పూల వాన -ప్రముఖ సాహిత్యవేత్త గంటా మనోహర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మాధవ స్వామి ల చేతుల మీదగా ఆవిష్కరించడం విశేషం. అనంతరం ఈ పుస్తకాలను సేవారత్న శ్రీ పలకలూరి శివరావు గారికి అంకితం చేశారు.ఒకే వేదిక, ఒకే రచయిత, ఒకే వ్యక్తి కి అంకితమిచ్చి ఆవిష్కరించడం అరుదైన ఘటన.పిదప బహు గ్రంథకర్త గద్వాల సోమన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అతిరథ మహారథులు, పాత్రికేయ మిత్రులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యావికాస్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఈనెల 8వ తేదిన హైదరాబాద్‌కు చెందిన రైసింగ్ నాలెడ్జి ఎడ్యూటెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా పామర్రులోని అస్సెస్సీ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన అబాకస్ & వేదిక్ మాథ్స్ జిల్లా స్థాయి ఇంటర్ స్కూల్ పోటీలలో విద్యావికాస్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించారు ఈ పోటీలలో మీగడ దివ్యశ్రీ (2వ తరగతి) – జిల్లా ప్రథమ స్థానం ఆలమూరి ప్రజ్ఞశ్రీ (3వ తరగతి) – జిల్లా ద్వితీయ స్థానం తిప్పా రేవంత్ (5వ తరగతి) – జిల్లా తృతీయ స్థానం సాధించి ప్రతిభ చాటారు. వీరు ముగ్గురూ స్టేట్ లెవల్ పోటీలకు అర్హత సాధించడం విశేషం. ఈ సందర్భంగా విద్యావికాస్ ప్రైమరీ స్కూల్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను అభినందించి, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల కృషిని ప్రశంసించారు. విద్యావికాస్ విద్యార్థులు అకడమిక్ రంగంలోనే కాకుండా గణిత నైపుణ్యాలలో కూడా ముందంజలో ఉన్నారని ఈ విజయం మరోసారి రుజువు చేసింది.

## బీజేపీ ఎస్సీ మోర్చా కార్యదర్శికి సత్కారం



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా కార్యాలయ కార్యదర్శిగా ఎన్నికైన అమర్లపుడి చిన్న గుడివాడ పట్టణానికి తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా స్థానిక భీమేశ్వర స్వామి దేవస్థానంలో వారికి పూజా కార్యక్రమాలు, దర్శనం చేపించి తదుపరి వారి మిత్రబృందం ఆయనని సన్మానించుకోవడం జరిగినది తొలుత చిన్న స్వామిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో కాపు సేవా సమితి మాజీ అధ్యక్షుడు నల్లగంచు రాంబాబు కార్యదర్శి ఆత్మూరి మల్లేశ్వరరావు టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా చంటి కురాళ్ల శ్యాంసుందర్ నేరెళ్ల శేషు బాబు ఆత్మకూరి బోస్ బాబు బీసీ నాయకులు మూడెడ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం కు పెరిగిన కౌలు ఆదాయం..

**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** గుడివాడ -నందివాడ మండలం, పెదవిరివాడ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానమునకు చెందిన చేపల చెరువులు బహిరంగ వేలంలో కౌలుకు ఇచ్చుటకు శుక్రవారం మధ్యాహ్నం స్వామి వారి దేవస్థానం వద్ద జరిగిన బహిరంగ వేలంపాట లో 11 ఎకరాల 62 సెంట్లు చేపల చెరువునకు ఎకరం ఒక్క ఇంటికి 65000/- చొప్పున 11 ఎకరాల 62 సెంట్లు 761,110/- చెల్లించులాగున కోటా వెంకట సత్యనారాయణ వరప్రసాద్ మూడు సంవత్సరముల కాల పరిమితికి హెచ్చు పాట పాడుకుని ఉన్నారు. రెండవ భాగం 5 ఎకరాల 42 సెంట్లు చేపల చెరువును లంకపల్లి వికాస్ ఎకరం ఒక్క ఇంటికి 45000/- చొప్పున 5 ఎకరాల 42 సెంట్లు 2 లక్షల 43 900 చెల్లించులాగున హెచ్చు పాట పాడుకుని ఉన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పోలవరపు వెంకట మురళి మాట్లాడుతూ ఈ బహిరంగ వేలం పాటలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మరియు దేవస్థానం ధర్మకర్తల మండలి మరియు గ్రామ గ్రామ ప్రముఖుల సమక్షంలో ఈ బహిరంగ వేలంపాట జరిగిందన్నారు. ఈ క్రమంలో ఆలయము యొక్క ఆదాయము గణనీయముగా పెరిగిందని పేర్కొన్నారు.

## మృతుడు కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చులు అందజేసిన పిఎసిఎస్



**కోడూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని వి కొత్తపాలెం గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సంఘంలో అప్పు దారులు అయి ఉండి ఇటీవల కాలంలో మృతి చెందిన రేపల్లె రాజయ్య కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయలు నగదు మట్టి ఖర్చుల నిమిత్తం సోమవారం సంఘ చైర్ పర్సన్ రేపల్లె పిచ్చేశ్వరరావు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వి కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సి. యు.ఓ.తోట శ్రీకాంత్, పర్సన్స్ రేపల్లె మల్లేశ్వరరావు, బాదరమల్లేశ్వరరావు,సంఘ సిబ్బంది చిన్నకల్లేపల్లి నాగమల్లేశ్వరరావు నరహరిశెట్టి నందకిషోర్, పాగోలు సురేంద్ర, కోడూరు పిఎసిఎస్ చైర్ పర్సన్ అయినా పోతబోయిన కరుణ్ కుమార్ కొండవీటి నాగేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

## కార్టూనిస్ట్ నారుకు కర్పూరి ఠాకూర్ పురస్కారం



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ వేదికలో ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భారతరత్న జననాయక్ బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ రాపోలు సుదర్శన్ హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రముఖ కార్టూన్ లిస్ట్ నారుకు భారతరత్న కర్పూరీ ఠాకూర్ స్ఫూర్తి పురస్కారం 2026 ను అందజేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో ఎఫ్‌డిఎఫ్ కన్వీనర్ డిఆర్బి ప్రసాద్ కృష్ణాజిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరి ంగ్ కమిటీ సభ్యులు ఆర్ వేణుబాబు భీమేశ్వరాలయ కమిటీ చైర్మన్ పట్టపు వెంకట సత్యనారాయణ (చిన్న) గుడివాడ వాకర్స్ పూర్వపు అధ్యక్షుడు డి వి సత్యనారాయణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు గుళిపల్లి ప్రభాకర్ రావు టైలర్స్ వర్కర్స్ అధ్యక్షుడు లంకపల్లి లాజర్ తెలుగు మహిళా వాకర్స్ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి శ్రీకృష్ణ యూత్ అధ్యక్షులు కొలుసు సతీష్ కుమార్ నవభారత్ ఖాది స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ సామాజిక కార్యకర్త పల్లపు అనిల్ వాసవి క్లబ్ నాయకులు గాదె మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చింతలూరుకు రితిక ఫౌండేషన్ 2026 నంది అవార్డు..



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు చింతలూరు సత్యనారాయణకు రితిక ఫౌండేషన్ 2026 నంది అవార్డు ఇవ్వడం జరిగినది.. సత్యనారాయణ దశాబ్ద కాలంగా టెన్త్ క్లాస్ పిల్లలకు స్కాలర్షిప్లు నోటి పుస్తకములు ఉచితంగా ఇవ్వడం జరుగుతున్నది అలాగే దసరా నవరాత్రులలో సరస్వతి పూజ రోజు పిల్లలకు పుస్తకంలో పెన్నులు అందజేయడం జరుగుచున్నది 2020 సంవత్సరంలో టెన్త్ క్లాస్ పిల్లలకు 500 మార్కులు దాటిన వాళ్ళకి కృష్ణ ఎన్టీఆర్ జిల్లాలో 2000 రూపాయల క్యాష్ మెమెంటో మెడల్ ఇవ్వడం జరిగింది ఈ క్రమంలో కనుక ఆయనకి నంది అవార్డు ఇవ్వడం జరిగినది పల్లెపూరు నాయకులు చారి వల్ల బాబు కిషోర్ చింతలూరు చంద్రశేఖర రావు కడారు ఉమామహే కడారు ఉమామహేశ్వరరావు ముంత వెంకటేశ్వరరావు డాక్టర్ శీను బాబు చిత్తూరు ప్రవీణ్ కుమార్ గిరిధర్ కుమార్ మాస్టర్ మట్ట రాజా మల్లంపల్లి వెంకటరావు తదితరులు అయిన ఘనంగా సన్మానించారు మరియు కుటుంబ సభ్యులు అభినందించారు.

## తెలుగు మహిళ వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు



**గుడివాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 204 కృష్ణాజిల్లా గవర్నర్ లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు మరియు తెలుగు మహిళ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణీల ఆధ్వర్యంలో ఒమేగా అనూ హాస్పటల్ విజయవాడ వారి సౌజన్యంతో ముదినేపల్లి మండలం, పెదపాలపర్రు గ్రామ కోదండ రామాలయం ప్రాంగణము నందు ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ వై. వరలక్ష్మి కార్డియాలజిస్ట్, డాక్టర్ గిరి సాయి రామ్ ఎండి జనరల్ మెడిసిన్, డాక్టర్ రవి రాజు, డాక్టర్ అజయ్ ఆప్తమాలజీ లు పాల్గొని 200 మందికి బీపీ, షుగర్, గుండె పరీక్షలైన ఈసీజీ, 2డి ఏకో, కీళ్ల పరీక్షలు నిర్వహించి, సలహాలు, సూచనలు తెలియజేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు కళ్ళజోడు అవసరమైన వారికి కేవలం 400 రూపాయలకే నాణ్యమైన కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి వీరమాచినేని శైలజ, చల్లా ఈశ్వరి దేవి లు మరియు స్టేడియం వాకర్స్ క్లబ్ అర్జ ప్రసాద్ మెరుగుమాల శివరామకృష్ణ దిమ్మిటి శివరామకృష్ణ మరడని వెంకటేశ్వరరావు మున్నలూరి రామకృష్ణ పొన్నూరు సత్యనారాయణ గాదంశెట్టి బసవేశ్వర రావు చందన వేణు నాయుడు బొప్పన కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## 46.80 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**కోడూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కోడూరు మండల పరిధిలోని జయపురం గ్రామ సర్పంచ్ పాలడుగు భార్గవి- ఆనందరావు ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు రూ.14.3లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జయపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీ,మాజీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ ఎంపీ లాడ్స్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన నిర్మించిన రెండు శ్లాబు కల్వర్టులు, నాలుగు తూము కల్వర్టులు ప్రారంభించారు. జిల్లా పరిషత్ 12శాతం త్రాగునీటి నిధులు రూ.12.50లక్షలతో నిర్మించిన 0.5 ఎం.ఎల్.డీ. మైక్రో ఫిల్టర్ కం ప్లాట్ ఫామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధా ప్రవీణ్, డ్రైనేజీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మల్లన్న పెల్లికి డబల్ రోడ్డు ఏర్పాటు





**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిధిలోని కొండపర్వ గ్రామంలో మల్లయ్య స్వామి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణ కార్యక్రమాలలో భాగంగా భక్తుల రాకపోకలకు డబల్ రోడ్డు ఏర్పాటు చేసినట్లు గ్రామ ప్రముఖులు మట్టా వేణుగోపాలరావు, కొత్తపల్లి మహేష్ లు మీడియా సమావేశంలో తెలియజేశారు. విస్సన్నపేట మండలం ఎస్ ఐ అర్జునరాజు రహదారుల పనులను పరిశీలించి రోడ్డు వెడల్పు చేయటం సంతోషకరమని వాహనదారులకు సౌకర్యవంతంగా ఉన్నదని చెప్పారు అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డి బుజ్జి, వెంకటేశ్వర్లు, బి ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ డీఆర్ఓగా తిప్పే నాయక్ బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కాకినాడ డిఆర్ఓగా డాక్టర్ డి.తిప్పే నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్లో ఉన్న ఆయన చాంబర్లో ఈ బాధ్యతలు స్వీకరణ చేపట్టారు. తిప్పే నాయక్ 2024 ఎన్నికల సమయంలో కూడా కాకినాడకు డీఆర్ఓగా బాధ్యతలు నిర్వహించి అనంతరం బదిలీపై అనంతపురం జిల్లా కెఆర్ఆర్సిసి డిప్యూటీ కలెక్టర్ గా బదిలీపై వెళ్లారు. అక్కడ సుమారు 14 నెలల పాటు పనిచేసి తిరిగి మరలా కాకినాడకు డీఆర్ఓగా వచ్చారు. ఈ సందర్భంగా డీఆర్ఓను కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కలెక్టరు ఎస్పీ లను కలిసిన డిఆర్వో



**కాకినాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా నూతన రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన టి.తిప్పేనాయక్ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి,ఎస్పీ బిందు మాధవ్ లను మర్యాదపూర్వకంగా కలిశారు.

# చెరుకు రసం బండిపైనే ఆమె జీవన పోరాటం..!

● భర్త వదిలేసినా...ముగ్గురు ఆడ పిల్లలు భారం అనుకోలేదు

● చెరుకు రసం అమ్మి ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటున్న భవాని




మనకు తెల్వని,నిజజీవితంలో చూడని చారిత్రాత్మకమైనవి, గొప్ప కథలే కాదు....నిత్య జీవితంలో ఎదురయ్యే కొన్ని లైఫ్ స్టోరీలు మనల్ని కదిలిస్తాయి....ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఒక తల్లి పడే తపన, వారి చదువు మరియు ఉన్నతి కోసం ఆమె చేసే జీవన పోరాటం అత్యంత ప్రేరణాత్మకం. ఒంటరిగానైనా సరే కష్టాలను ఎదుర్కొని పిల్లలకు ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తూ వారిని సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టడం కోసం ఆ తల్లి పడే తపన అంతా ఇంతా కాదు...! కష్టకాలంలో కూడా అధైర్యపడ కుండా పట్టుదలతో ముగ్గురు పిల్లల బాధ్యతను మోయడం అనేది ఆ తల్లికి మానసిక, ఆర్థిక సవాళ్లతో కూడిన బాధ్యత.భర్త వదిలేసిన పరిస్థితుల్లోనూ చాలామంది మహిళలు ధైర్యం గా తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న సందర్భాలు అప్పుడప్పుడు మనం వింటూనే ఉంటాం....! అలాంటి కథే ఇది కూడా.....

**మైలవరం,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన గొడ్డళ్ళ భవాని తన ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్ కోసం మోటార్ ఇంజన్ బండిపై ఊరూరు తిరుగుతూ చెరుకు రసం అమ్మి జీవనం సాగిస్తోంది.తన భర్త మద్యానికి బానిసగా మారి చివరికి తనను తమ ముగ్గురు ఆడ పిల్లలను వదిలి వెళ్లిపోయాడని భవాని వాపోయింది.తమ ముగ్గురు ఆడపిల్లను బతికించుకోవడం కోసం తాను మోటార్ ఇంజన్ బండి డ్రైవ్ చేసుకుంటూ చుట్టుపక్కల గ్రామాలు వెళ్లి చెరుకురసం అమ్ముతున్నానని భవాని తెలిపారు.పెద్ద కుమార్తె 7వ తరగతి చదువు తోందని, రెండవ కుమార్తె 3వ తరగతి చదువు తోందని, చివరి కుమార్తె అంగన్వాడీ స్కూల్ కి వెళుతుందని ఆమె తెలిపారు.భర్త వదిలేసినప్పటికీ ముగ్గురు ఆడబిడ్డల భవిష్యత్తు కోసం ఎవరిపై ఆధారపడకుండా మొక్కవోని ఆత్మ విశ్వాసంతో చెరుకు రసం అమ్ముకుంటు జీవనం సాగిస్తున్న ఆ తల్లి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పడం అతిశయోక్తి కాదు.

# ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్ తో హెచ్డీఎఫ్సీ లైఫ్ ఎంఓయూ




**విజయవాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా కంపెనీ హెచ్డీఎఫ్సీ లైఫ్ కేరళలోని తిరువనంతపురంలో ప్రధాన కార్యాలయం కలిగిన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ (ముత్తూట్ బ్లూ) యొక్క ప్రధాన సంస్థ అయిన ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ కస్టమర్లు హెచ్డీఎఫ్సీ లైఫ్ యొక్క సమగ్రమైన గ్రూప్ మరియు వ్యక్తిగత జీవిత బీమా పరిష్కారాలను యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుంది. ఇందులో రక్షణ మరియు దీర్ఘకాలిక పొదుపు ఉత్పత్తులు ఉన్నాయి. వీటిలో వారి వారి అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను చేరుకోవచ్చు. వీటిని ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క 3750 కి పైగా శాఖల విస్తృత నెట్వర్క్ ద్వారా మరియు దాని డిజిటల్ ప్లాట్ఫామ్ ద్వారా అందించబడుతుందని హెచ్డీఎఫ్సీ లైఫ్ డైరెక్టర్ విభా పడాల్కర్ తెలిపారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్తో మా భాగస్వామ్యం '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని సాధించే దిశలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందన్నారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క విలువైన కస్టమర్లకు, ఇప్పటికే ఉన్న మరియు కొత్త, ప్రభావవంతమైన జీవిత బీమా పరిష్కారాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పిస్తుంది. ఇంకా, మా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క టచ్పాయింట్లలోని బృందాలు.. వారి కస్టమర్లకు ఆనందదాయకమైన అనుభవాన్ని అందించడానికి డిజిటల్గా సాధికారత పొందేలా చేస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, దేశంలో జీవిత బీమా పరిధిని విస్తరించడానికి మరియు ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మేము ఎదురుచూస్తున్నాము." అని అన్నారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ డైరెక్టర్ షాజీ వర్గీస్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం 3,750 కి పైగా శాఖల పరిధి, డిజిటల్ ప్లాట్ఫారమ్లు, మిలియన్ల మంది వినియోగదారులతో మాకున్న సంబంధాలు మరియు హెచ్డిఎఫ్సి లైఫ్ యొక్క ఉత్పత్తి మరియు రిస్క్ నైపుణ్యాన్ని కలిపి భారతీయ కుటుంబాలకు అర్థవంతమైన రక్షణను అందిస్తాయని చెప్పారు.

# శ్రీకాకుళంలో నేడు, రేపు శ్రీకృష్ణ దేవరాయ ఉత్సవాలు

## –ఉత్సవాలు ప్రారంభించనున్న జస్టిస్ యు.దుర్గా ప్రసాద్, కలెక్టర్ బాలాజీ.

**ఘంటసాల/అవనిగడ్డ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా, ఘంటసాల మండలం శ్రీకాకుళంలో శ్రీకృష్ణ దేవరాయ మహోత్సవాలను ఫిబ్రవరి 10వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభిస్తారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని ఆంధ్ర మహా విష్ణువుగా ఖ్యాతి గాంచిన శ్రీకాకుళేశ్వర స్వామి వారి దేవస్థానంలో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో వేటూరి సుందర రామమూర్తి రచించిన 'సిరికాకొలను చిన్నది' నృత్య నాటికను ప్రసిద్ధ నాట్య కళాకారిణి స్మితా మాధవ్ బృందం ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో వేటూరి సుందర రామమూర్తి సతీమణి సీతామహాలక్ష్మమ్మను సత్కరించనున్నట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. 1518 ఫిబ్రవరి 11వ తేదీన శ్రీకృష్ణ దేవరాయల వారు శ్రీకాకుళం వచ్చినట్లు శాసన ఆధారాలు ఉన్నాయని దీని ప్రకారం 2007నుంచి శ్రీకృష్ణ దేవరాయ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఉత్సవాలను ముందుకు తీసుకు వెళ్లలేదన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఈ ఉత్సవాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆంధ్ర మహా విష్ణువు శ్రీకృష్ణ దేవరాయలుకు కలలో కనిపించి తెలుగులో కావ్యం వ్రాయమని ఆదేశించటం, తత్ఫలితంగా ఆముక్త మాల్యద గ్రంథ రచనకు శ్రీకృష్ణ దేవరాయలు శ్రీకారం చుట్టిన మహోన్నత సందర్భాన్ని గుర్తు చేస్తూ తెలుగు భాష పరిరక్షణకు ఈ ఉత్సవాలు దోహద పడతాయని బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు.

# మన ఓటే మన ఆయుధం గెలుపే మన లక్ష్యం.. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం..

## –బేరి రామచందర్ యాదవ్ బీసీ సంఘాల పిలుపు



**హైదరాబాద్,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** తెలంగాణరాష్ట్రవ్యాప్తంగా జరుగుచున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఓటర్లను తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికలు కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నందున బిసి అభ్యర్థులను మన ఓట్లు మనకే అన్న బీసీ సూత్రం ప్రకారం ఎస్సీ ఎస్టీ మైనార్టీషన్ కలుపుకొని ఎస్సీ ఎస్టీ మైనారిటీస్ రిజర్వ్ స్థానాల్లో మనవాళ్ళు వారికి ఓటు వేయడం వారిని సమన్వయపరచుకొని మన అభ్యర్థులు ఉన్నచోట వారి ఓట్లు మన ఓట్లు వేయించుకొని అత్యధిక మెజార్టీతో బీసీ అభ్యర్థులు గెలిచేటట్లు చూడాలని బేరి రామచంద్ర యాదవ్ కోరడం జరిగింది. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా నల్గొండ జిల్లా మేడ్చల్ జిల్లా మహబూబ్ నగర్ జిల్లా వికారాబాద్ జిల్లా రంగారెడ్డి జిల్లాలో పర్యటించడం జరిగింది. సంగారెడ్డి జిల్లాలో పర్యటించి బిసి ముఖ్య నాయకులనుకలిసి బీసీ అభ్యర్థులను గెలిపించే విధంగా ప్రచారం కొనసాగించాలని బేరి రామచందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ ఎలక్షన్ లో కూడా బీసీలు అత్యధిక స్థానాలు గెలవడం జరిగింది జనరల్ స్థానాల్లో కూడా చాలామంది పోటీ చేసి గెలవడం విశేషం బిసి. ఓటర్ మహాశయులారా మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధిక మొత్తంలో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులకు కార్యకర్తలకు మరియు బిసి ప్రజానీకానికి విన్నవించడం జరిగింది. సంగారెడ్డి జిల్లా పర్యటనలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు సాయన్న ముదిరాజ్, రాష్ట్ర సెక్రెటరీ మారుతి ముదిరాజ్, ఆర్గనైజర్ సెక్రెటరీ హరికృష్ణ చారి, రాష్ట్ర బీసీ నాయకులు అశోక్ గౌడ్, నాయి బ్రాహ్మణ సంఘం రమేష్, రజక సంఘం కిషోర్, పద్మశాలి కృష్ణ నేత,, మేదరి మహేందర్ సంఘం కిరణ్ కుమార్, పెద్దలు కార్యకర్తలు పాల్గొని కార్యకర్తలను నాయకులు కలవడం జరిగింది.

# ర్యాంకింగ్స్లో కాకినాడ సిటీకి 3వ స్థానం.. ఎమ్మెల్యే వనమాడి హర్షం




**కాకినాడ,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నియోజకవర్గాల ర్యాంకింగ్స్లో మూడో స్థానంలో నిలవడంపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హర్షం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ సత్యనారాయణ, అధికారులు శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఈ విజయంలో భాగస్వాములైన అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ "అభివృద్ధి, సంక్షేమ సూచికల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకింగ్స్లో కాకినాడ సిటీ నియోజకవర్గం మూడో స్థానంలో నిలవడం గర్వకారణమని, ఇది ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని, ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు చూపిన నిబద్ధత అభినందనీయమని, భవిష్యత్తులో కాకినాడ సిటీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఇదే ఉత్సాహంతో పని చేయడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో అభివృద్ధి, ప్రజాసేవల విషయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లిబాబు, అడిషనల్ కమిషనర్ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ పృధ్వి చరణ్, తహసిల్దార్ జితేంద్ర, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్షనర్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా

● కనీస పెన్షన్ రూ.9000లు చెల్లించాలని డిమాండ్



**అమలాపురం,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఈపీఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9000లు డిఏతో కలిపి చెల్లించాలనీ హయ్యర్ వేతనంతో రిటైర్ అయిన పెన్షనర్లకు అందరికీ హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాలనీ కోరుతూ ఆల్ ఇండియా యునైటెడ్ యాక్షన్ కమిటీ ఆఫ్ ఈపీఎఫ్ 95 పెన్షనర్స్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు సోమవారం అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఐవి మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు లెటర్లు పొంది సకాలంలో డిపాజిట్లు చెల్లించలేని వారికి డిపాజిట్లు చెల్లించుటకు మరొక అవకాశం ఇచ్చి సమయం పెంచాలనీ అన్నారు.ఈపీఎస్ 95 పెన్షనర్లకు, భాగస్వామికి అంత్యక్రియలకు రూ10 వేలు. లు మంజూరు చేయాలనీ ఈపీఎస్ 95 పెన్షనర్లకు భాగస్వామికి ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీనియర్ సిటిజనులకు రైల్వే ప్రయాణాల్లో రాయితీలు పునరుద్ధరించాలని కేంద్రప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లకు 8వ పిఆర్సి అమలు జరిపే వరకు మధ్యంతర భృతి మంజూరు చేయాలనీ పెన్షన్ వాలిడేషన్ బిల్లు 2025ను రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు.సిపిఎస్ యుపిఎస్ రద్దుచేసి ఏ పి ఎస్ ను అమలు చేయాలనీ 12వ పిఆర్సి కమిటీని నియమించి మధ్యంతర భృతి చెల్లించాలనీ పెండింగ్ లో ఉన్న పి.ఎఫ్. బకాయిలు, ఐదు డిఏలను వెంటనే మంజూరు చేయాలని జూలై 2018 నుండి పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలనీ ఆగస్టు 2024 నుండి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఉపాధ్యాయులకు గ్రాడ్యుటీ బకాయిలు చెల్లించాలని 2020 తరువాత మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పిల్లలకు కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలనీ ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కడలి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి జి. గోపాలకృష్ణ సీనియర్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డి వీరస్వామి,ఎం. వెంకటేశ్వరరావు, కె.వి. రమణ, వి.బానోజీరావు ,నాగ జనార్ధనరావు, డి. శ్రీరామ్మూర్తి ,డి. సత్యనారాయణ, గోపాలకృష్ణ, సఖిలే సూర్యనారాయణ కేవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు సిఐటియు నాయకులు దుర్గాప్రసాద్ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కిసాన్ యోజన పథకం కౌలు రైతులకు వర్తింపు చేయాలి



**కంకిపాడు/ పెనమలూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో కౌలు విస్తీర్ణం పెరుగుతుందని దీంతో కౌలు రైతుల సంఖ్య పెరుగుతుందని కానీ కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం కౌలు రైతులకు వర్తింప చేయడం లేదని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. కంకిపాడు మండలం మద్దూరు గ్రామంలో ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సదస్సు నిర్వహించారు. అనంతరం కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా జరిగిన సదస్సులో హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల మందికి పైగా కౌలు రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వాస్తవ సాగుదారులైన కౌలు దారులను గుర్తించడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గంలోనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నడుస్తున్నాయని కూటమి ప్రభుత్వం పాత చట్టాలను రద్దుచేసి కౌలు రైతులకు అనుకూలమైన నూతన చట్టాన్ని తీసుకువస్తామని చెప్పి రెండేళ్లయిన దాని గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. 2014 ఎన్నికలలో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతుకు రెండు రెట్లు ఆదాయం పెంచుతామని హామీ ఇచ్చి ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయారన్నారు. 2005లో మహాత్మా గాంధీ పేరుతో వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో కోట్ల మంది పనికి హామీ లేకుండా నూతన పథకాన్ని తీసుకువచ్చి 20 కోట్ల మంది గ్రామీణ పేదలకు తీవ్రమైన నష్టం జరిగేటట్లు చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టం అమలు జరిగిన చోట గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన తో పాటు, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్రం తో పాటు, భూస్వామ్య వర్గాలతో బేరమాడే శక్తి పేదలకు కల్పించిందన్నారు. లక్షలాది ఎకరాల పేదల భూమి అభివృద్ధికి నోచుకుందని కరోనా కష్టకాలంలో కూడా దేశమంతా చిన్నా భిన్నమైన గ్రామీణ ఉపాధి హామీ చట్టం కోట్లాదిమందికి ఉపాధి చూపించి అన్నం పెట్టిందన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సింది పోయి రాష్ట్రాల మీద భారం పడేలా కేంద్ర వాటా 60 శాతం రాష్ట్ర వాటా 40% కు పెంచారు అన్నారు. దీనివల్ల పేదలకు మరింత నష్టం జరుగుతుందన్నారు. చట్టాన్ని మరింత బలోపేతం చేసి కుటుంబానికి రెండు వందల రోజుల పని 600 రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు .రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆజాద్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి సీటు ప్లస్ విధానంతో గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నూతన విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి పి రంగారావు, రైతు సంఘం నాయకులు సిహెచ్ శ్రీహరి, పి దుర్గారావు, వివిధ సంఘాల నాయకులు పీత నాగేశ్వరరావు, మండవ వెంకట్, కె అప్పారావు, పి ధనుంజయ్, ఎన్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎరుకోపాడులో వివాహితపై అత్యాచారయత్నం

**తిరువూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం ఏరుకోపాడు గ్రామం ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన సురగం శ్రీనివాసరావు.విషయం బయటకు చెప్తే తనను తన భర్తను,పిల్లలను చంపుతానని బెదిరింపు.ఆమె భర్త సహాయంతో తిరువూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితురాలు. బుధవారం నాడు ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు తమకు న్యాయం చేయలేదంటున్న బాధితురాలు.తమకు న్యాయం చేయాలని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి కోరుతున్న భర్త ఎరువ బ్రహ్మం.చిన్నపాటి సెక్షన్లు పెట్టి కేసును నీరుగార్చే యత్నం చేస్తున్నారని బాధితుల ఆందోళన..

# విలేజ్ హెల్త్ క్లినిక్ కు ఎమ్మెల్యే శంకుస్థాపన



**అమలాపురం,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** బండారులంక గ్రామంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అమలాపురం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా రెండు విలేజ్ హెల్త్ క్లినిక్ లకు శంకుస్థాపనలు చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు, గ్రామ టిడిపి అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు ,బొర్రా ఈశ్వర్రావు, చొల్లంగి సాయిబాబా, అధికారి జయ వెంకటలక్ష్మి, కొండా సూర్యకుమారి,మందా గెద్దయ్య, ఈటకోట నాగేశ్వరావు, బళ్ళ వెంకటేశ్వరరావు, ఆశపు రామలింగేశ్వర్రావు, కడలి వెంకటేశ్వరరావు ,యిళ్ళ మురళి, కాశిన బాబి, యాళ్ళ కుమార్, చింతపట్ల గంగా సత్యనారాయణ, కొల్లి అంబేద్కర్, ఉందుర్తి జీవరత్నం, ఈతకోట రాజేష్, దంగేటి శ్రీరామ్, కొండా సత్యనారాయణ రాజు, ఏకుల విజయ్, కాశిన ఫణి, తులా సతీష్, తెలుగు దేశం పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెండెం శ్రీనివాస్ మల్లయ్య



**విస్సన్నపేట,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** విస్సన్నపేట పద్మశాలి స్ట్రీట్ కు చెందిన పెండెం శ్రీనివాస మల్లయ్యకు రాష్ట్ర పద్మశాలి సంఘ ఉపాధ్యక్షులుగా రాష్ట్ర అధ్యక్షులు జె శ్రీనివాసరావు నియామక పత్రం అందించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవుల అభివృద్ధికి ఆర్థిక ఎదుగుదలకు శ్రీ భద్రావతి సమేత భావన ఋషి స్వామివారి సాక్షిగా చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు.

# ప్రజా బంధు అవార్డు అందుకున్న కాకుమాను



**కంకిపాడు/ పెనమలూరు,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** కంకిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, న్యాయవాది కాకుమాను రమేష్ ను హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారు ఆయన చేసిన సంఘ సేవలకు, అడ్వకేట్ గా గుర్తించి హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాబంధు పురస్కారాన్ని ప్రశంస పత్రాన్ని ప్రముఖ సుప్రీంకోర్టు అడ్వకేట్ నేరెళ్ల మల్యాద్రి అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నేను చేసిన సేవలకు హ్యూమన్ రైట్స్ సమస్త వారు గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని. నా బాధ్యతలను మరింత మెరుగ్గా నిర్వహిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమాలు హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొడక్షన్ సర్వీస్ ప్రతినిధులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన ఎస్పీఎంజీ బృందం

## - పరిశ్రమల నిర్మాణ పనులపై సమీక్ష



**తిరుపతి,ఫిబ్రవరి 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైన ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (ఎస్.పి.ఎం.జి.) అధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించి, కీలక పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించింది. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్య ప్రాజెక్టుల సమయానుకూల అమలును పర్యవేక్షించడం, వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ గ్రూప్ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఈ మేరకు ఎస్పీఎంజీ బృంద సభ్యుడు హర్షద్ పోలాకి నేతృత్వంలో శ్రీసిటీలో పర్యటించి, ప్రధాన ప్రాజెక్టుల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. శ్రీసిటీలోని అక్సెలెంట్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ మరియు సమీపంలోని అపోలో టైర్స్ పరిశ్రమల నిర్మాణాల పురోగతిని తనిఖీ చేశారు.దీనిపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎస్పీఎంజీ చేపడుతున్న ఈ తరహా సమీక్షలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడం, వేగవంతమైన అనుమతులు, శాఖల మధ్య సమన్వయం, సమస్యల సత్వర పరిష్కారం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చర్యలను ఆయన ప్రశంసించారు.ఈ పర్యటన ద్వారా ప్రాజెక్టుల అమలు వేగం, ఎదురవుతున్న సమస్యలపై ప్రత్యక్ష అవగాహన లభించిందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల పూర్తి కావడంలో ఆటంకాలను గుర్తించి, వాటిని తొలగించే దిశగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఈ సమీక్ష ఉపకరిస్తుందని వారు తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188